మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU

దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 15-8-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 || సంచిక: 47 Issue: 47

శ్రీ పరాభవ నామ సంవత్సరం, దక్షిణాయనం - వర్ష ఋతువు, శ్రావణ మాసం - శుక్లపక్షం. సూర్యోదయం - ఉ. 6:02. సూర్యాస్తమయం - సా. 6:38. తిథి. తదియ సా. 5:34 వరకు. తరువాత చవితి. సంస్కృత వారం. స్థిర వాసరః. నక్షత్రం. ఉత్తర ఫల్గుని(ఉత్తర) తె. 3:230 వరకు. తరువాత హస్త. యోగం శివ ఉ. 7:03 వరకు కరణం. తైతుల ఉ. 6:03 వరకు. గరజి సా. 5:34 వరకు. వర్జ్యం. ఉ. 10:49 నుండి మ. 12:24 వరకు. దుర్ముహూర్తం. ఉ. 7:43 నుండి ఉ. 8:34 వరకు. రాహుకాలం. ఉ. 9:11 నుండి ఉ. 10:46 వరకు. యమగండం. మ. 1:55 నుండి మ. 3:29 వరకు. గుళికాకాలం. ఉ. 6:02 నుండి ఉ. 7:37 వరకు. బ్రహ్మముహూర్తం. తె. 4:26 నుండి తె. 5:14 వరకు. అమృత ఘడియలు. రా. 8:17 నుండి రా. 9:52 వరకు. అభిజిత్ ముహూర్తం. ఉ. 11:55 నుండి మ. 12:45 వరకు. గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana




భారత ప్రజలు, నేటి 'ఈవార్తలు' దినపత్రిక పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్.

# భారత రైళ్లపై ఐఎస్ఐ మైండ్ గేమ్

### తప్పుడు సమాచారంతో భయాందోళనలు సృష్టించే కుట్రలు

### సైనిక స్థావరాల కంటే ఎక్కువగా రైల్వేలపై సమాచారం సేకరణ

### భారత నిఘా వర్గాల (ఐబీ) నివేదికలో వెల్లడి



భారతీయ రైల్వే వ్యవస్థపై పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ (ఐఎస్ఐ) భారీ కుట్రకు తెరలేపినట్లు భారత నిఘా వర్గాలు సంచలన విషయాలు వెల్లడించాయి. రైల్వేలు ఇటీవల కాలంలో ఉగ్రవాదుల ప్రధాన లక్ష్యంగా మారాయని, దేశవ్యాప్తంగా భయాందోళనలు సృష్టించేందుకు ఐఎస్ఐ ఒక పక్కా వ్యూహంతో ముందుకెళుతోందని ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) తన నివేదికలో హెచ్చరించింది. › 3

# అల్‌ఖైదా అడ్డాగా బంగ్లాదేశ్!

### ఉగ్ర సెల్స్‌ను ఏర్పాటుకు ఏక్యూఐఎస్ యత్నాలు

### ఆందోళన వ్యక్తం చేసిన ఐక్యరాజ్యసమితి



బంగ్లాదేశ్‌ను అడ్డాగా మార్చుకుని ఉగ్రవాద కార్యకలాపాలను విస్తరించేందుకు అల్‌ఖైదా ప్రయత్నిస్తోందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. 'అల్‌ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్' (ఏక్యూఐఎస్) అక్కడ ఉగ్రవాద సెల్స్‌ను ఏర్పాటు చేసేందుకు చురుగ్గా కదులుతున్నట్లు వెల్లడించింది. › 3




## పోలీస్ ఉద్యోగార్థుల వయోపరిమితి మరో రెండేళ్లకు పెంపు

హైదరాబాద్, ఆగస్టు 14 (ఈవార్తలు): పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఇటీవలే ఏడు వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిన సర్కార్.. యూనిఫామ్‌డ్ సర్వీసెస్ (పోలీస్) ఉద్యోగ నియామకాలకు గరిష్ట వయోపరిమితి మరో రెండేళ్లకు పెంచింది. ఇప్పటివరకున్న ఐదేళ్లకు.. ఈ రెండేళ్లు కలవడంతో మొత్తంగా గరిష్ట వయోపరిమితి పెంపు ఏడేళ్లకు చేరింది. ఈ సడలింపు ప్రస్తుత రిక్రూట్‌మెంట్లకు వర్తింస్తుందని ప్రభుత్వం పేర్కొంది. యూనిఫామ్‌డ్ సర్వీసెస్ (పోలీస్) ఉద్యోగాల నియామకాలకు సంబంధించి నిరుద్యోగ యువతకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పోలీస్, ఫైర్, జైళ్లు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఎక్సైజ్, రవాణా, అటవీ శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసే పోస్టులకు గరిష్ట వయోపరిమితిని

- తరువాయి 2 వ పేజీలో...

# ముందే పైసలిస్తా!

## ఏడాది ముందే విద్యార్థుల అకౌంట్లలో ఫీజు రీయింబర్స్‌మెంట్

### సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టు పరిస్థితి రానివ్వం.. పూలే దంపతుల విగ్రహావిష్కరణ సభలో సీఎం రేవంత్



హైదరాబాద్, ఆగస్టు 14 (ఈవార్తలు): ఉన్నత విద్యను అభ్యసించే పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఫీజు భారం తగ్గించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ముందుగానే విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో అందుబాటులో ఉంచే విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ సమీపంలోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించిన తర్వాత జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం సుమారు రూ. 2,400 కోట్ల

- తరువాయి 2 వ పేజీలో...

## ఎలక్ట్రిక్ ఆటో కొంటే 1.50 లక్షల సబ్సిడీ

- 'కోర్' ఆటో డ్రైవర్లకు సదవకాశం
- డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్ 2.0
- ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో సదస్సు నిర్వహణ
- నేడు రాష్ట్రమంతా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
- ఏడు రకాల సన్నాలకు రూ.500 బోనస్
- మరో ఏడు యంగ్ ఇండియా స్కూళ్లు
- రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు › 2



ఉగ్రవాదంపై కఠిన వైఖరి

## వికసిత భారత్ సమష్టి సంకల్పం

### యువత, మహిళలకు ప్రాధాన్యం.. స్వాతంత్ర్య దినోత్సవం వేళ రాష్ట్రపతి ప్రసంగం

న్యూఢిల్లీ: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ భారత్ గత దశాబ్దంలో వేగవంతమైన, సమ్మిళిత అభివృద్ధిని సాధించిందని ఆమె పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారత్ ఉగ్రవాదం, ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పించే శక్తుల విషయంలో ఇక ఎంతమాత్రం రాజీపడదని రాష్ట్రపతి స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ భారత సైనిక దళాల అసమాన పరాక్రమానికి నిదర్శనమని కొనియాడారు. ఉగ్రవాదులు

- తరువాయి 3 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,289 |
| వెండి (కిలో): | రూ.2,55,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,228 |

# మధ్యలో మీరెవరు?



హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ విద్యార్థుల విషయంలో బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) తీసుకున్న వివాదాస్పద నిర్ణయంపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా స్పందించారు.

### బీసీఐపై సీజేఐ తీవ్ర ఆగ్రహం..

### తారాస్థాయికి నల్సార్ వివాదం

### బీసీఐ చర్య చట్టవిరుద్ధం

### సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్

న్యూఢిల్లీ: ఈ విషయంలో మీరు జోక్యం చేసుకోవద్దని బీసీఐని ఆయన గట్టిగా హెచ్చరించారు. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐ హాజరుకావడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు ప్రచారం చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన బీసీఐ, విచారణ పూర్తయ్యే వరకు 2026 బ్యాచ్‌కు చెందిన నల్సార్ గ్రాడ్యుయేట్లను న్యాయవాదులుగా నమోదు చేయవద్దని దేశంలోని అన్ని రాష్ట్రాల బార్

- తరువాయి 2 వ పేజీలో...





## గోదావరి పుష్కరాలకు 1000 కోట్లు

### సెప్టెంబర్ తొలి వారంలో పనులు ప్రారంభం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి

### పనుల పురోగతిని పర్యవేక్షణకు ప్రత్యేక డాష్‌బోర్డ్

హైదరాబాద్, ఆగస్టు 14 (ఈవార్తలు): 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటి నుంచే సన్నాహాలు ప్రారంభించింది. ఈ పుష్కరాల పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయించినట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. సెప్టెంబర్ మొదటి వారంలోనే

- తరువాయి 2 వ పేజీలో...

## టీవీ యాడ్స్‌పై 12 నిమిషాల పరిమితి ఎత్తివేత



టెలివిజన్ ఛానెళ్ల ప్రసారాల్లో ప్రకటనల సమయంపై ఉన్న కీలక నిబంధనను కేంద్ర ప్రభుత్వం తొలగించింది. గంటకు 12 నిమిషాలు మాత్రమే ప్రకటనలు ప్రసారం చేయాలన్న పరిమితిని ఎత్తివేస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. › 2

## విశ్వవాణి



లోతైన సముద్ర జలాల్లోనూ భారీ స్థాయిలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి చేసే లక్ష్యంతో చైనా ప్రపంచంలోనే అతిపెద్ద ఏకైక తేలియాడే సముద్ర పవన విద్యుత్ టర్బైన్ 'త్రీ గోర్జెస్ పైలట్'ను పరీక్షించడం ప్రారంభించింది. సంప్రదాయ సముద్ర పవన టర్బైన్లకు భిన్నంగా ఇది సముద్రపు అడుగున నేరుగా అమర్చకుండా, ప్రత్యేక తేలియాడే వేదికపై ఏర్పాటు చేశారు. ఈ భారీ టర్బైన్ సామర్థ్యం 16 మెగావాట్లు. సముద్రపు అడుగుకు బిగించి ఉంచే సంప్రదాయ టర్బైన్లకు బదులుగా, ఇది సముద్రంపై తేలియాడే వేదికపై ఉంటుంది. ఆ వేదికను సముద్రపు అడుగుకు అనేక లంగర్ల ద్వారా బిగించి ఉంచుతారు. ఈ విధానం వల్ల తీరానికి దూరంగా, మరింత లోతైన సముద్ర ప్రాంతాల్లోనూ పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది.

# జనగణనలో 40 ప్రశ్నలు!

## నోటిఫై చేసిన కేంద్ర ప్రభుత్వం.. సెప్టెంబర్‌లో జనాభా లెక్కింపు ప్రారంభం



సెప్టెంబర్ 1 నుంచి మంచు తీవ్రంగా కురిసే ప్రాంతాల్లో జనగణన ప్రారంభం కానుంది. అక్కడ జనగణన ప్రక్రియలో భాగంగా సిబ్బంది ప్రజలను అడగాల్సిన 40 ప్రశ్నలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది.

న్యూఢిల్లీ: కులం, కోవిడ్ టీకా వేయించుకున్న ప్రదేశం, షెడ్యూల్డ్ కులం లేదా షెడ్యూల్డ్ తెగకు చెందినవారా? కాదా? వంటి ప్రశ్నలను జనగణన సందర్భంగా సిబ్బంది ప్రజలను అడగనున్నారు. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు. జనాభా గణన చట్టం-1948లోని సెక్షన్ 8, ఉప విభాగం (1) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం ఈ కింది ఆదేశాలను జారీ చేసింది. నియమించిన అధికారులు తమ పరిధిలోని ప్రాంతాల్లో నివసించే వ్యక్తులను హౌస్‌హోల్డ్ షెడ్యూల్ (కుటుంబ వివరాల పత్రం) ద్వారా సమాచారాన్ని సేకరించేందుకు, నిర్దేశించిన అంశాలకు సంబంధించి ప్రశ్నలు అడగవచ్చు'

- తరువాయి 2 వ పేజీలో...



## 2000 మందికి నిత్యాన్నదానం

### 43.12 కోట్లతో దీక్షా మండపం

### 26 అంశాలకు యాదగిరిగుట్ట పాలక మండలి ఆమోదం

యాదగిరిగుట్ట, ఆగస్టు 14 (ఈవార్తలు): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా ఆలయ పాలక మండలి కీలక నిర్ణయాలు తీసుకుంది. పాలక మండలి చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో

- తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

15-8-2026

మేషం: పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. అవసరానికి సన్నిహితుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారములు లాభసాటిగా సాగుతాయి. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో సమస్యలను తెలివిగా పరిష్కరించుకుంటారు.

వృషభం: ముఖ్యమైన వ్యవహారాలలో సన్నిహితులతో వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు కలసిరావు.

మిధునం: సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. నూతన ఋణ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు, ఉద్యోగాల ప్రయత్నలలో అవరోధాలు తొలగుతాయి.

కర్కాటకం: సంఘంలో పెద్దలతో పరిచయాలు విస్తృతమౌతాయి. ఉద్యోగస్తుల జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగావకాశములు లభిస్తాయి. స్థిరాస్తి వ్యవహారాలలో సమస్యలు అధిగమిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

సింహం: కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. చేపట్టిన వ్యవహారాలు మధ్యలో నిలిచిపోతాయి. వ్యాపారాలలో స్వంత ఆలోచనలు అంతగా కలసిరావు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. మిత్రులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

కన్య: దూరపు బంధువుల నుండి కీలక విషయాలు తెలుస్తాయి. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. నూతన ఋణ యత్నాలు కొంత కష్టంతో పూర్తవుతాయి. బందు మిత్రులతో మాటపట్టింపులుంటాయి. వ్యాపార వ్యవహారాలలో అలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. వృత్తి ఉద్యోగాలు కొంత నిదానంగా సాగుతాయి.

తుల: కుటుంబ పెద్దలతో గృహమున సందడిగా గడుపుతారు. బంధు మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. భూ క్రయవిక్రయాలలో విశేషమైన లాభాలు అందుతాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి,ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

వృశ్చికం: సమాజంలో గౌరవ మర్యాదలు విస్తృతమౌతాయి. అప్పులతో దీర్ఘకాలిక వివాదాలు తీరి ఊరట చెందుతారు. అనుకున్న సమయానికి పనులు పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలు మరింత అనుకూలంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగ విషయంలో ఉన్న సమస్యలు అధిగమిస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

ధనస్సు: సంతాన విద్యా విషయాలు నిరుత్సాహపరుస్తాయి. ఆర్థిక వ్యవహారాలు కొంత చికాకు పరుస్తాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. దైవ సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది.వృత్తి ఉద్యోగాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది.

మకరం: ముఖ్యమైన వ్యవహారాలలో కొంత జాప్యం కలుగుతుంది. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. బంధువుల నుండి అందిన ఒక వార్త నిరుత్సాహం కలిగిస్తుంది. ఋణ దాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు.

కుంభం: గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఆత్మీయులతో కీలక విషయాల గురించి చర్చిస్తారు. బంధు మిత్రుల సహాయ సహకారాలు అందుతాయి. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు కుదురుతాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో సమస్యల నుంచి అధికారుల సహాయంతో బయటపడతారు.

మీనం: ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఋణ సంబంధిత సమస్యల వలన ఒత్తిడి తప్పదు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. సంతాన ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అంచనాలు అందుకోవడంలో సమస్యలు తప్పవు.

# ఎలక్ట్రిక్ ఆటో కొంటే 1.50 లక్షల సబ్సిడీ

**'కోర్' ఆటో డ్రైవర్లకు సదవకాశం**

**డిసెంబర్‌లో గ్లోబల్ సమ్మిట్ 2.0**

**ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్‌తో సదస్సు నిర్వహణ**

**నేడు రాష్ట్రమంతా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ**

**ఏడు రకాల సన్నాలకు రూ.500 బోనస్**

**మరో ఏడు యంగ్ ఇండియా స్కూళ్లు**

**రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు**

హైదరాబాద్, ఆగస్టు 14 (ఈవార్తలు): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. అన్ని జిల్లాల్లో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసింది. దీంతో రాష్ట్రంలో అదనంగా 62 లక్షల మందికి రేషన్ లబ్ధి చేకూరింది. గతంలో 2.81 కోట్లుగా ఉన్న రేషన్ లబ్ధిదారుల సంఖ్య ప్రస్తుతం 3.42 కోట్లకు చేరింది. వీరందరికీ స్మార్ట్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. గత ఏడాది నిర్వహించిన తరహాలోనే ఈ ఏడాది కూడా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో సదస్సు నిర్వహించేందుకు ప్రాథమికంగా నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో సబ్‌కమిటీని ఏర్పాటు చేయనుంది. 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈసారి సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. ఫ్యూచర్ సిటీ ప్రణాళికను కూడా ఈ సందర్భంగా ఆవిష్కరించనున్నారు. డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా తదితర రంగాల్లో తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడమే ప్రధాన లక్ష్యంగా సదస్సు జరగనుంది. తెలంగాణ స్టార్టప్‌లు, పరిశ్రమలు సాధించిన విజయాలు, నూతన ఆవిష్కరణలను ప్రదర్శించేలా ఎగ్జిబిషన్లు, స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు.

**ఏడు రకాల సన్నాలకు రూ.500 బోనస్**

వానాకాలం సీజన్‌లో ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ రకాల సాగు పెరిగేలా రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని, గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా ప్రచారం నిర్వహించాలని ఆదేశించింది. ఈ ఏడాది నుంచి గుర్తించిన ఏడు రకాల సన్నాలకు మాత్రమే క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాలని తీర్మానించింది. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని కేబినెట్ పేర్కొంది. ఈసారి రికార్డు స్థాయిలో 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇందులో 63.62 లక్షల మెట్రిక్ టన్నులను కేంద్ర ప్రభుత్వం సేకరించనుండగా, మిగిలిన 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ-వేలం ద్వారా విక్రయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. క్వింటాల్‌కు రూ.2,389 బేసిక్ ప్రైస్‌గా నిర్ణయించి ఈ-ఆక్షన్ నిర్వహించాలని నిర్ణయించారు. ఇటీవల మొక్కజొన్న ఈ-వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూరిన నేపథ్యంలో మిగులు ధాన్యాన్ని కూడా ఇదే విధానంలో విక్రయించనున్నారు.

**స్కిల్స్ వర్సిటీ పరిధిలోకి ఐటీఐలు**

రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సాంకేతిక విద్యాశాఖ పరిధిలో ఉన్న ఈ సంస్థలను తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించారు. పరిపాలనా పరంగా వీటిని శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేయడానికి కూడా కేబినెట్ తీర్మానించింది. ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా తొలివిడతలో 113 నియోజకవర్గాల్లో ఈ స్కూల్ కాంప్లెక్స్‌లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా ఆమోదించిన ఏడు స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 స్కూల్ కాంప్లెక్స్‌లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజకవర్గాల్లో స్థల సేకరణను వేగవంతం చేసి నిర్మాణాలు చేపట్టాలని కేబినెట్ ఆదేశించింది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న స్కూళ్లను త్వరగా పూర్తి చేసి, నిర్మాణాలు పూర్తయిన చోట వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించాలని నిర్ణయించింది.

**హైదరాబాద్‌లో ఆటోలు ఎలక్ట్రిక్ బాట**

హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా మార్చడంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. కోర్ అర్బన్ రీజియన్‌లోని 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లతో తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్ అమలు చేయడానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల సబ్సిడీ అందించనున్నారు. ప్రస్తుత ఆటోకు ఎలక్ట్రిక్ కిట్ అమర్చుకోవడం లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త ఎలక్ట్రిక్ ఆటో కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. హైదరాబాద్ నగర పరిధిలోని కాలుష్య కారక పరిశ్రమలను నగర శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన హిల్ట్ పాలసీ దరఖాస్తుల గడువును మరో మూడు నెలలు పొడిగించాలని కేబినెట్ నిర్ణయించింది. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ఫేజ్-2 పనులకు రూ.2,100 కోట్ల అంచనా వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుతో దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు ఆయా ప్రాంతాల తాగునీటి, పారిశ్రామిక అవసరాలను తీర్చేందుకు అవకాశం ఏర్పడనుంది. గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని ప్రస్తుత 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సోలార్ విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై సమగ్ర అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్‌ను నియమించేందుకు కూడా మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

## ముందే పైసలిస్తా!

(మొదటి పేజీ తరువాయి)

మేర ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు కేటాయిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటికే రూ.250 కోట్లను ముందస్తుగా బ్యాంకు అకౌంట్లలో ఉంచినట్లు చెప్పారు. విద్యార్థులు కాలేజీల్లో ప్రవేశం పొందిన తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే.. నెలలోపే వారి ఖాతాలో ఫీజు రీయింబర్స్‌మెంట్ జమయ్యేలా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీలు ఇబ్బంది పెట్టే పరిస్థితికి ఇకపై అవకాశం ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో మధ్యవర్తిత్వం, జాప్యం లేకుండా పారదర్శకంగా నగదు బదిలీ చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. డిగ్రీలు, సర్టిఫికెట్లు మాత్రమే ఉంటే సరిపోదని.. మారుతున్న ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా టెక్నికల్ స్కిల్స్‌ను పెంచుకోవాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా ఐటీ రంగంలో ఉద్యోగాల స్వరూపం మారుతున్న నేపథ్యంలో యువత కొత్త టెక్నాలజీలను నేర్చుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వీటిలో ట్రైనింగ్ తీసుకునే విద్యార్థులకు స్టైపెండ్ అందించే విధానం కూడా అమల్లో ఉందని పేర్కొన్నారు. నర్సింగ్, టెక్నికల్ విద్య, భాషా నైపుణ్యాలకు అంతర్జాతీయంగా అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొంటూ.. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో ప్రత్యేక నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

## టీవీ యాడ్స్‌పై 12 నిమిషాల పరిమితి ఎత్తివేత

న్యూఢిల్లీ: టెలివిజన్ ఛానెళ్ల ప్రసారాల్లో ప్రకటనల సమయంపై ఉన్న కీలక నిబంధనను కేంద్ర ప్రభుత్వం తొలగించింది. గంటకు 12 నిమిషాలు మాత్రమే ప్రకటనలు ప్రసారం చేయాలన్న పరిమితిని ఎత్తివేస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. టీవీ, డిజిటల్ మీడియా మధ్య సమాన పోటీని ప్రోత్సహించడం, వ్యాపార సౌలభ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. 1994 నాటి కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ నిబంధనల కింద 2006లో ఈ 12 నిమిషాల ప్రకటనల పరిమితిని ప్రవేశపెట్టారు. అయితే, అప్పటి నుంచి ఇప్పటివరకు టీవీ ప్రసార రంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయని మంత్రిత్వ శాఖ వివరించింది. 2006లో దేశంలో కేవలం 62 టీవీ ఛానెళ్లు మాత్రమే ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 900కు పైగా ఉందని గుర్తు చేసింది. ఆ రోజుల్లో అనలాగ్ పద్ధతిలో ఉన్న కేబుల్ టీవీ ప్రసారాల వల్ల ఛానెళ్ల సంఖ్య పరిమితంగా ఉండేది. కానీ, ఇప్పుడు కేబుల్ టీవీ రంగం పూర్తిగా డిజిటలైజ్ అయింది. డీటీహెచ్, కేబుల్ టీవీ, ఐపీటీవీ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు 300 నుంచి 500కు పైగా ఛానెళ్లను అందిస్తూ ప్రేక్షకులకు విస్తృత ఎంపికలు కల్పిస్తున్నాయి. దీనివల్ల మార్కెట్‌లో పోటీతత్వం గణనీయంగా పెరిగిందని ప్రభుత్వం పేర్కొంది. భారత్‌లో టీవీ రంగం 'పే' లేదా 'ఫ్రీ-టు-ఎయిర్' ఛానెల్ అనే దానితో సంబంధం లేకుండా ప్రకటనల ఆదాయంపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. మరోవైపు, డిజిటల్ మీడియా, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో ప్రకటనలపై ఎలాంటి కాలపరిమితి నిబంధన లేదు.

## మధ్యలో మీరెవరు?

(మొదటి పేజీ తరువాయి)

కౌన్సిళ్లకు నిన్న ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రచారానికి ఎవరు సూత్రధారులో తేల్చేందుకు నివేదిక ఇవ్వాలని యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్‌ను కోరింది. బీసీఐ చర్యపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇది అస్సలు ఆమోదయోగ్యం కాదు. నేను కూడా విద్యార్థిగా ఉన్నప్పుడు నిరసనల్లో చురుగ్గా పాల్గొన్నాను. ఇది నాకు, విద్యార్థులకు మధ్య జరగాల్సిన సంభాషణ. ఇందులో జోక్యం చేసుకోవడానికి వాళ్లెవరు?' అని ఆయన ఘాటుగా ప్రశ్నించారు. ఈ వివాదంపై వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు బీసీఐని ఆదేశించింది. నల్సార్ విద్యార్థులు లేదా అధ్యాపకులపై ఎలాంటి శిక్షాత్మక చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. అంతకుముందు బీసీఐ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ తీవ్రంగా ఖండించారు. ఇది ఏకపక్షం, చట్టవిరుద్ధమని పేర్కొంటూ బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రాకు లేఖ రాశారు. భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకున్నందుకు న్యాయ విద్యార్థులను భయపెట్టడమేనని, రాజ్యాంగబద్ధమైన అధికారితో విభేదించినంత మాత్రాన వారిని వృత్తిలోకి రాకుండా అడ్డుకోలేరని స్పష్టం చేశారు. నలువైపుల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో బీసీఐ కొన్ని గంటల్లోనే తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది.

## గోదావరి పుష్కరాలకు 1000 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

పనులు ప్రారంభించి, ఆగస్టు నెలాఖరు నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో 'గోదావరి పుష్కరాలు-2027'పై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశానికి మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. పుష్కరాల ఏర్పాట్లపై శాఖల వారీగా జరుగుతున్న పురోగతిని కమిటీ సభ్యులు సమీక్షించి, అధికారులకు కీలక సూచనలు చేశారు. భక్తుల రద్దీ అత్యధికంగా ఉండే 'టైర్-1' ప్రాంతాలకు ప్రత్యేకంగా అధికారులను నియమించాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. కీలక ప్రాంతాల్లో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా సీనియర్ అధికారులు బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు దేవాదాయ శాఖ ప్రత్యేక డాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అనుసంధానంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే గుర్తించి, స్థానిక నిధులతో పనులు పూర్తి చేయాలన్నారు. పుష్కరాల ఏర్పాట్లలో స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులు, పండితులను భాగస్వాములను చేయాలని సూచించారు.

# జనగణనలో 40 ప్రశ్నలు!

(మొదటి పేజీ తరువాయి)

అని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా వెల్లడించారు. జనగణన సమయంలో ప్రజలను వారి వైవాహిక స్థితి, వివాహ సమయంలో వయసు, జీవిత భాగస్వామి పేరు, జాతీయత, మతం, ఎస్సీ/ఎస్టీ, కులం, తల్లిదండ్రుల వివరాలు, వైకల్యం, మాతృభాష, తెలిసిన ఇతర భాషలు, అక్షరాస్యత, డిజిటల్ లిటరసీ వంటి వ్యక్తిగత వివరాల గురించి సిబ్బంది అడుగుతారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. విద్యాసంస్థలో హాజరు, అత్యున్నత విద్యా స్థాయి, చదువుకున్న విభాగం లేదా సబ్జెక్టు, గత ఏడాది కాలంలో జాబ్ చేశారా, ఆర్థిక స్థితి, వృత్తి వంటి వివరాలను కోరుతారని వెల్లడించాయి. అలాగే వలసదారులకు పలు ప్రశ్నలను అడుగుతారని చెప్పాయి. పుట్టిన ప్రదేశం, అంతకుముందు నివసించిన ప్రదేశం, వలసకు గల కారణం, చివరి వలస తర్వాత ఈ గ్రామం/పట్టణంలో ఎప్పటి నుంచి నివసిస్తున్నారు, శాశ్వత నివాస చిరునామా వంటి వివరాలను సిబ్బంది కోరుతారని సంబంధిత వర్గాలు తెలిపాయి. కొవిడ్-19 టీకా వేయించుకున్న ప్రదేశం, మొత్తం బ్యాంక్ ఖాతాల సంఖ్య, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్, ఓటర్ ఐడీ నంబర్, పాస్‌పోర్ట్ నంబర్, డ్రైవింగ్ లైసెన్స్ ఉందా? లేదా? అనే వివరాలను కూడా అడుగుతాయని చెప్పాయి. అయితే సిబ్బంది ప్రజలను అడిగే ప్రశ్నావళిలో కులాల జాబితా ఉండే అవకాశం లేదని వెల్లడించాయి. ప్రజలు స్వయంగా చెప్పిన వివరాలనే సిబ్బంది నమోదు చేస్తారని పేర్కొన్నాయి.

**సెప్టెంబరు 1 నుంచి మంచు ప్రభావిత రాష్ట్రాల్లో జనగణన**

లద్దాఖ్, జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మంచుతో కూడిన (సాధారణ సమయాల్లో గణన జరగని) ప్రాంతాల్లో జనగణన సెప్టెంబర్ 1-30 వరకు జరగనుందని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ ఆగస్టు ప్రారంభంలో ఓ ఉత్తర్వును జారీ చేశారు. ఈ జనగణన నిర్వహణలో భాగంగా ఇంటింటికీ వెళ్లి జనాభా వివరాలు సేకరించే ప్రక్రియ ప్రారంభానికి ముందు ఆగస్టు 17-31 వరకు స్వయంగా వివరాలు నమోదు చేసుకునే (సెల్ఫ్ ఎన్యూరేషన్) సదుపాయం కూడా ఉంటుందని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. అయితే దేశంలోని మిగిలిన ప్రాంతాలలో జనగణన వచ్చే ఏడాది ప్రారంభమవుతుంది. కాగా, జనగణనలో భాగంగా కుల వివరాలను సేకరించడం ఇదే మొదటిసారి కానుంది.

## 2000 మందికి నిత్యాన్నదానం

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన తొలి సమావేశంలో మొత్తం 26 అంశాలకు ఆమోదం తెలిపినట్లు ఆలయ వర్గాలు వెల్లడించారు. భక్తులకు ఆధ్యాత్మిక సేవలతో పాటు మౌలిక వసతులను విస్తరించడంపై సమావేశంలో పాలకమండలి అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. భక్తులకు అందించే అన్నప్రసాదం సామర్థ్యాన్ని పెంచాలని పాలక మండలి నిర్ణయించింది. ప్రస్తుతం 1,500 మంది భక్తుల వరకు భోజనం చేసే సౌకర్యం ఉండగా.. ఇకపై రోజుకు 2 వేల మంది భక్తులకు అన్నదానం అందించేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా ప్రసాద వితరణ వ్యవస్థను మరింత విస్తరించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక దీక్షతో యాదగిరిగుట్టకు వచ్చే భక్తుల కోసం రూ.43.12 కోట్ల అంచనా వ్యయంతో ప్రత్యేక దీక్షాపరుల మండపాన్ని నిర్మించేందుకు ఆమోదం లభించింది. అలాగే బాలాలయం ఉన్న ప్రదేశంలో రూ.9.87 కోట్లతో నిత్యకల్యాణ మండపాన్ని నిర్మించనున్నారు. రాయగిరి వద్ద స్వామివారి ఆలయానికి ఆకర్షణగా నిలిచే ఆర్చ్ నిర్మాణానికి కూడా నిర్ణయం తీసుకున్నారు. యాదగిరిగుట్ట ఆలయానికి వచ్చే భక్తులకు సేవలు సులభంగా అందేలా సాంకేతిక వ్యవస్థను విస్తరించనున్నారు. టీసీఎస్ సహకారంతో వివిధ ఆలయ సేవలను టెక్నాలజీ ఆధారంగా అనుసంధానం చేసే ప్రతిపాదనకు పాలక మండలి ఆమోదం తెలిపింది. ఆర్జిత సేవలు, నిత్య కైంకర్యాలకు ఆన్‌లైన్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడంపై కూడా నిర్ణయం తీసుకున్నారు. కాలినడకన కొండపైకి వెళ్లే భక్తుల కోసం మెట్ల మార్గంలో సుమారు రూ.1.4 కోట్లతో పైకప్పు నిర్మాణం చేపట్టనున్నారు. ఎండ, వర్షం నుంచి భక్తులకు రక్షణ కల్పించడమే దీని ఉద్దేశం. గిరిప్రదక్షిణ మార్గం వద్ద సోలార్ పవర్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు. వేద విద్యను ప్రోత్సహించేలా వేద పాఠశాలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయనున్నారు. తులసి కాటేజ్ వద్ద మరో కల్యాణకట్ట, దాతల కోసం ప్రత్యేక సదుపాయాలు, కొండపై విరాళాల నిర్వహణకు ప్రత్యేక గది వంటి ప్రతిపాదనలకు కూడా ఆమోదం లభించింది. కొణిదల సురేఖ విరాళంతో రూ.84 లక్షల వ్యయంతో ఎలక్ట్రిక్ శంఖు, చక్ర నామాల బోర్డు ఏర్పాటు చేయనున్నారు.




## పోలీస్ ఉద్యోగార్థుల వయోపరిమితి మరో రెండేళ్లకు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

మరో రెండేళ్లు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే 2026 మే 18వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. ఈ యూనిఫామ్డ్ సర్వీసెస్ పోస్టులకు నిర్దేశిత గరిష్ఠ వయోపరిమితికి అదనంగా ఐదేళ్ల వయో సడలింపు కల్పించారు. తాజాగా ఉత్వర్వుల ద్వారా ఆ ఐదేళ్ల సడలింపునకు అదనంగా మరో రెండేళ్లను పెంచారు. దీంతో నిర్దేశిత గరిష్ఠ వయోపరిమితిపై మొత్తం ఏడు సంవత్సరాల వరకు అదనపు వయో సడలింపు లభించనుంది. ఆగస్టు 14, శుక్రవారం నుంచి ఈ గరిష్ఠ పెంపు అమలులో ఉండనుంది. నిరుద్యోగ యువత నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను ప్రభుత్వం పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకుంది. మరింత మంది నిరుద్యోగ యువత డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో పాల్గొనేందుకు అర్హత పొందేలా ఈ వయోపరిమితి పెంపు అవకాశం కల్పించనుంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర గెజిట్‌లో నోటిఫికేషన్ ప్రచురించాలని ప్రభుత్వం ఆదేశించింది. తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, సంబంధిత శాఖలు, అధికారులకు ఈ ఉత్తర్వులను అమలు కోసం పంపించారు. ఈ వయోపరిమితి పెంపు పోలీస్, ఫైర్, జైళ్లు, ఎస్పీఎఫ్, ఎక్సైజ్, రవాణా, అటవీ శాఖల్లోని యూనిఫామ్డ్ సర్వీసెస్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు వర్తిస్తుంది.




# ఎల్లుండి సనత్‌నగర్ టిమ్స్ అందుబాటులోకి!

**ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 14 (ఈవార్తలు): నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మించిన సనత్‌నగర్‌లోని మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎంసీఆర్ టిమ్స్) ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ నెల 17వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అధికారికంగా ప్రారంభించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి ప్రాంగణంలో 22.6 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,070 కోట్ల భారీ బడ్జెట్‌తో దీన్ని నిర్మించారు. మొత్తం 1082 పడకల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ఆసుపత్రిలో తొలిదశలో 582 పడకలతో సేవలను ప్రారంభించనున్నారు. మిగిలిన 500 పడకలు ఈ ఏడాది అక్టోబర్ నాటికి అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే మే నెల నుంచి ఓపీ విభాగంలో ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా, రోజూ 200 నుంచి 250 మంది వరకు రోగులు చికిత్స పొందుతున్నారు. ఈ ఆసుపత్రి ప్రధానంగా నాలుగు కీలక విభాగాలకు కేంద్రంగా నిలవనుంది. కార్డియాక్ (గుండె సంబంధిత), నెఫ్రాలజీ-యూరాలజీ (మూత్రపిండాల సంబంధిత), అవయవ మార్పిడి, ట్రామా విభాగాల్లో ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నారు. వీటికి అనుబంధంగా మరో 37 విభాగాలు పనిచేస్తాయి. ఈ ఆస్పత్రికి నిమ్స్ తరహాలోనే స్వయంప్రతిపత్తి హోదా కల్పించారు. దీంతో నిధులను సొంతంగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అయితే, తొలి ఐదారేళ్ల పాటు ప్రభుత్వం గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందిస్తుంది. వాస్తవానికి, గత ఏడాది డిసెంబర్‌లో, ఆ తర్వాత ఉగాదికి ఈ ఆసుపత్రిని ప్రారంభించాలని భావించినా, పనులు పూర్తికాకపోవడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు అన్ని పనులు పూర్తికావడంతో ప్రభుత్వం దీనిని ప్రారంభించేందుకు సిద్ధమైంది.

## భారత రైళ్లపై ఐఎస్ఐ 'మైండ్ గేమ్'

**తప్పుడు సమాచారంతో భయాందోళనలు సృష్టించే కుట్రలు**

**సైనిక స్థావరాల కంటే ఎక్కువగా రైల్వేలపై సమాచారం సేకరణ**

**భారత నిఘా వర్గాల (ఐబీ) నివేదికలో వెల్లడి**

న్యూఢిల్లీ: భారతీయ రైల్వే వ్యవస్థపై పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ (ఐఎస్ఐ) భారీ కుట్రకు తెరలేపినట్లు భారత నిఘా వర్గాలు సంచలన విషయాలు వెల్లడించాయి. రైల్వేలు ఇటీవల కాలంలో ఉగ్రవాదుల ప్రధాన లక్ష్యంగా మారాయని, దేశవ్యాప్తంగా భయాందోళనలు సృష్టించేందుకు ఐఎస్ఐ ఒక పక్కా వ్యూహంతో ముందుకెళుతోందని ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) తన నివేదికలో హెచ్చరించింది. స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న తరుణంలో ఈ హెచ్చరికలు తీవ్ర ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఐబీ అధికారుల ప్రకారం.. ఐఎస్ఐ తన గూఢచర్య కార్యకలాపాలను ప్రధానంగా భారత సైన్యం, రైల్వేలపైనే కేంద్రీకరించింది. అయితే, ఇటీవలి కాలంలో ఈ వ్యూహంలో స్పష్టమైన మార్పు కనబడుతోంది. సైనిక స్థావరాలపై సమాచారం సేకరణ దీర్ఘకాలిక వ్యూహంలో భాగంగా ఉండగా, రైల్వేలపై మాత్రం తక్షణ దాడులు చేయాలనే ఉద్దేశంతో సమాచారాన్ని సేకరిస్తున్నారు. దేశ రవాణా వ్యవస్థకు రైల్వేలు వెన్నెముక అని, వాటిని దెబ్బతీస్తే ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించవచ్చని ఐఎస్ఐ భావిస్తోంది. ఈ కుట్రలో భాగంగా ఐఎస్ఐ రెండు రకాల వ్యూహాలను అమలు చేస్తోంది. ఒకటి, రైల్వే స్టేషన్లు, ట్రాక్‌లపై నేరుగా దాడులు చేయడం. రెండోది, ప్రజలను మానసికంగా దెబ్బతీసేందుకు 'మైండ్ గేమ్స్' ఆడటం. ఇందుకోసం ప్రత్యేకంగా కొందరిని నియమించుకుని, రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో బాంబు బెదిరింపుల వంటి తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయిస్తున్నారు. ఇలాంటి పుకార్లతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగి, ఎలాంటి దాడి లేకుండానే భారీ ప్రాణనష్టం కలిగించవచ్చని అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ కుట్ర కోసం గత ఏడాది కాలంగా ఐఎస్ఐ నిఘాను పది రెట్లు పెంచింది. కేవలం రూ.3,000 వంటి స్వల్ప మొత్తానికే కొందరు యువకులను ఏజెంట్లుగా నియమించుకుని, వారి ద్వారా రైల్వే స్టేషన్లలోని కీలక ప్రదేశాలను ఫొటోలు తీయించడం, భద్రతా ఏర్పాట్లను అంచనా వేయించడం వంటివి చేస్తోంది. మరింత పక్కాగా సమాచారం కోసం కొన్ని రైల్వే స్టేషన్లలో సోలార్ పవర్ ఆధారిత సీసీటీవీ కెమెరాలను కూడా రహస్యంగా ఏర్పాటు చేయించినట్లు దర్యాప్తులో తేలింది. ఒక్కో కెమెరా అమర్చినందుకు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు చెల్లించినట్లు అధికారులు గుర్తించారు. ఈ దాడులకు ఇస్లామిస్ట్ గ్రూపులతో పాటు పంజాబ్, హర్యానాల్లో రైల్వేలను లక్ష్యం చేసుకునేందుకు 'బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్' (బీకేఐ) వంటి సంస్థలను కూడా ఐఎస్ఐ వాడుకుంటోందని తెలిసింది. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో భద్రతా బలగాలు ఢిల్లీపై ఎక్కువగా దృష్టి సారిస్తాయని, ఇదే అదనుగా రైల్వే వ్యవస్థపై దాడికి ఉగ్రమూకలు ప్రయత్నించవచ్చని ఐబీ హెచ్చరించింది. దీంతో ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్లలో హై అలర్ట్ ప్రకటించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

## అల్‌ఖైదా అడ్డాగా బంగ్లాదేశ్!

**ఉగ్ర సెల్స్‌ను ఏర్పాటుకు ఏక్యూఐఎస్ యత్నాలు**

**ఆందోళన వ్యక్తం చేసిన ఐక్యరాజ్యసమితి**

ఢాకా: బంగ్లాదేశ్‌ను అడ్డాగా మార్చుకుని ఉగ్రవాద కార్యకలాపాలను విస్తరించేందుకు అల్‌ఖైదా ప్రయత్నిస్తోందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. 'అల్‌ఖైదా ఇన్ ది ఇండియన్ సబ్‌కాంటినెంట్' (ఏక్యూఐఎస్) అక్కడ ఉగ్రవాద సెల్స్‌ను ఏర్పాటు చేసేందుకు చురుగ్గా కదులుతున్నట్లు వెల్లడించింది. దక్షిణాసియాలో ఉగ్ర ముప్పు మరింత తీవ్రంగా మారుతోందని పేర్కొంది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి సమర్పించిన 38వ నివేదికలో ఈ విషయాలను వెల్లడించింది. ఐసిస్, అల్‌ఖైదా తదితర ఉగ్ర సంస్థలపై పనిచేసే విశ్లేషణ, ఆంక్షల పర్యవేక్షణ బృందం ఈ నివేదికను రూపొందించింది. నివేదిక ప్రకారం.. ఏక్యూఐఎస్ గతంలో మాదిరిగా పెద్ద ఉగ్ర బృందాలపై ఆధారపడటం లేదు. చిన్నచిన్న, చెదురుమదురు సెల్స్‌తో పనిచేస్తోంది. లాజిస్టిక్స్, ఆర్థిక నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేసుకుంటోంది. ఈ విధానంతో ప్రాంతీయంగా తన కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రయత్నిస్తోంది. 2025 నవంబరులో ఢిల్లీలో జరిగిన ఎర్రకోట దాడికి ఏక్యూఐఎస్‌తో సంబంధం ఉన్నట్లు నివేదిక పేర్కొన్న విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌ను ఉగ్ర నెట్‌వర్క్ నిర్మాణానికి స్థావరంగా మార్చుకునే ప్రయత్నాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిణామాల తర్వాత ఉగ్ర సంస్థలకు అనుకూల వాతావరణం ఏర్పడే అవకాశాలపై ఇప్పటికే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐరాస తాజా హెచ్చరిక ప్రాధాన్యం సంతరించుకుంది. దక్షిణాసియాలో ఉగ్ర ముప్పు పెరగడానికి పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు కూడా కారణమవుతున్నాయని నివేదిక తెలిపింది. తాలిబన్ పాలనలో ఆఫ్ఘనిస్థాన్‌లో పలు ఉగ్ర సంస్థలు కార్యకలాపాలు సాగించడం పొరుగు దేశాలకు దీర్ఘకాలిక ముప్పుగా మారిందని హెచ్చరించింది.

## స్కూల్ ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి

హైదరాబాద్, ఆగస్టు 14 (ఈవార్తలు): ప్రైవేట్ పాఠశాలల ఫీజుల పెంపుపై విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతున్నాయని ఆరోపించారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఈ భారం పడుతోందని పేర్కొన్నారు. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన వీడియోలో ఆయన ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తారు. నాణ్యమైన విద్య అందక పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపలేని పరిస్థితి ఉందన్నారు. మరోవైపు ప్రైవేట్ స్కూళ్లలో భారీ ఫీజులతో కుటుంబాల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## గంజాయి ముఠాతో పోలీసుల దోస్తీ

**బాలానగర్ కేసులో వెలుగులోకి సంచలన విషయాలు**



బాలానగర్-హైదరాబాద్, ఆగస్టు 14 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని బాలానగర్‌లో గంజాయి విక్రయిస్తున్న ఓ ముఠాను పట్టుకోవడానికి వెళ్లిన పోలీసులపై నిందితులుఎదురుదాడికి దిగారు. కుక్కలను ఉసిగొల్పి, స్క్రూడ్రైవర్‌తో దాడి చేసి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనలో తెలంగాణ ఈగల్ పోలీసులు సినీ ఫక్కీలో నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ ముఠాతో స్థానిక పోలీసులకు దగ్గరి సంబంధాలు ఉన్నట్టు తేలడం సంచలనం రేపుతోంది. ఏపీలోని పాడేరుకు చెందిన ముగ్గురు అన్నదమ్ములు బాలానగర్‌ను కేంద్రంగా చేసుకుని గంజాయి దందా నడుపుతున్నారు. క్యాటరింగ్ ముసుగులో ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల నుంచి గంజాయి తెచ్చి వాట్సప్ ద్వారా విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో ఈగల్ పోలీసులు బుధవారం అర్ధరాత్రి నిందితుల ఇంటిపై దాడి చేశారు. పోలీసులను గమనించిన నిందితులు వారిపైకి కుక్కలను వదిలారు. ఈ దాడిలో ఓ కానిస్టేబుల్ గాయపడ్డారు. ఇంతలో కిరణ్ అనే నిందితుడు ఓ ఇన్‌స్పెక్టర్‌ను స్క్రూడ్రైవర్‌తో పొడిచి భవనాలపైకి దూకుతూ పారిపోయే ప్రయత్నం చేశాడు. మూడంతస్తుల అపార్ట్‌మెంట్‌పైకి ఎక్కి, సెల్ఫీ వీడియో తీసుకుంటూ ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. కిందకు దూకడంతో గాయపడిన అతడిని పోలీసులు పట్టుకుని ఆసుపత్రికి తరలించారు. అతడి భార్య హారికను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 14.5 కిలోల గంజాయి, ఒక ఎయిర్ గన్ స్వాధీనం చేసుకున్నారు. విచారణలో గంజాయి ముఠాతో బాలానగర్ ఠాణాకు చెందిన ఓ ఎస్సై, ఐదుగురు కానిస్టేబుళ్లకు సంబంధాలున్నట్లు తేలింది. ఈగల్ పోలీసుల దాడికి కొన్ని నిమిషాల ముందే ఓ కానిస్టేబుల్ నిందితుల ఇంటికి వచ్చి వెళ్లినట్లు గుర్తించారు. నిందితుల ఇంట్లో పోలీసులకు చెందిన వైర్‌లెస్ సెట్ పరికరం (మ్యాన్‌ప్యాక్) కూడా లభించడం కలకలం రేపుతోంది. ఈ ముఠాకు 200 మందికి పైగా కస్టమర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారిలో 100 మందిని గుర్తించి అదుపులోకి తీసుకుని పరీక్షించగా వారిలో 72 మందికి పాజిటివ్ వచ్చిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## ఆన్‌లైన్ టికెట్.. మోసగాళ్లతో జాగ్రత్త: టీటీడీ



కలియుగ దైవం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి గదుల బుకింగ్‌ల పేరుతో ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాల పట్ల భక్తులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శుక్రవారం ఒక ప్రకటనలో గట్టిగా హెచ్చరించింది. టీటీడీ పేరుతో నకిలీ వెబ్‌సైట్లు, వాట్సాప్ సందేశాలు, సోషల్ మీడియా పేజీలను సృష్టించి కొందరు మోసగాళ్లు భక్తుల భక్తిని ఆసరాగా చేసుకుని ఆర్థికంగా దోచుకుంటున్నారని, ఇటువంటి మోసాల బారిన పడవద్దని విజ్ఞప్తి చేసింది. కొందరు కేటుగాళ్లు టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌ను పోలిన విధంగా నకిలీ వెబ్‌సైట్లను రూపొందిస్తున్నారు. టీటీడీ లోగో, శ్రీవారి చిత్రాలను వాడుతూ భక్తులను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. సులభంగా శ్రీవారి దర్శనం, కల్యాణోత్సవం వంటి ఆర్జిత సేవలు, తిరుమలలో వసతి గదులు ఇప్పిస్తామని వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా పేజీల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారాన్ని నమ్మిన అమాయక భక్తులు, వారిని సంప్రదించినప్పుడు ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు. డబ్బులు చెల్లించిన తర్వాత, వారు నకిలీ బుకింగ్ పత్రాలను పంపడం లేదా పూర్తిగా అదృశ్యం కావడం వంటివి చేస్తున్నారు. తీరా తిరుమల వచ్చిన తర్వాత తాము మోసపోయామని గ్రహించిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ తరహా ఫిర్యాదులు టీటీడీ విజిలెన్స్ విభాగానికి ఇటీవలి కాలంలో అధికంగా అందుతున్నాయి. ఈ సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు టీటీడీ పటిష్ఠమైన చర్యలు చేపట్టింది. టీటీడీ ఐటీ విభాగం, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం, సైబర్ క్రైమ్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఆన్‌లైన్ మోసాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. టీటీడీ పేరు, లోగో, ట్రేడ్‌మార్క్‌లను దుర్వినియోగం చేస్తున్న నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా ఖాతాలను నిరంతరం పర్యవేక్షిస్తోంది.

## హద్దులు దాటొద్దు, భాష జాగ్రత్త

**జనసైనికులకు పవన్ వార్నింగ్**



మంగళగిరి, ఆగస్టు 14 (ఈవార్తలు): సోషల్ మీడియా వేదికగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన వైఖరిపై జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరోసారి కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. పార్టీ నేతలు, జనసైనికులు, వీర మహిళలు పోస్టులు పెట్టేటప్పుడు, వివిధ అంశాలపై స్పందించేటప్పుడు భాష విషయంలో సంయమనం పాటించాలని, పరిధి దాటవద్దని ఆయన స్పష్టంగా దిశానిర్దేశం చేశారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం మాట్లాడటం, అసభ్య పదజాలం ఉపయోగించడం సరికాదని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో, ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తరుణంలో పార్టీ ప్రతిష్ఠకు భంగం కలగకుండా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

## అప్పలరాజుకు బెయిల్

శ్రీకాకుళం, ఆగస్టు 14 (ఈవార్తలు): తన కుమారుడు చేసిన బైక్ యాక్సిడెంట్ లో ఒక వ్యక్తి మరణించిన కేసులో ఆధారాలను తారుమారు చేసేందుకు యత్నించినట్టు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటూ రిమాండ్‌లో ఉన్న వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు న్యాయస్థానంలో ఊరట లభించింది. శ్రీకాకుళం జిల్లా సోంపేట కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ ప్రయాణిస్తున్న బైక్ ఢీకొని దానయ్య అనే ఒక గొర్రెల కాపరి మృతి చెందిన ఘటనలో సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలతో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా జులై 22న పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. దాదాపు 23 రోజుల పాటు ఆయన జిల్లా జైల్లోనే రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ మధ్య కాలంలో పలుమార్లు బెయిల్ పిటిషన్ విచారణకు వచ్చినప్పటికీ కోర్టు తీర్పును వాయిదా వేస్తూ వచ్చింది. అలాగే కాశీబుగ్గ పోలీసులు ఆయన్ను విచారణ నిమిత్తం కస్టడీకి కోరగా న్యాయస్థానం ఆ విజ్ఞప్తిని నిరాకరించింది.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## వికసిత భారత్ సమష్టి సంకల్పం

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడ దాక్కున్నా తమ చర్యలకు తగిన పర్యవసానాలను ఎదుర్కోవాల్సిందేననే స్పష్టమైన సందేశాన్ని ఈ చర్య ఇచ్చిందన్నారు. ఉగ్రవాదానికి ఆశ్రయం కల్పించే దేశంతో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం కూడా దేశ ప్రయోజనాలు, ముఖ్యంగా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తీసుకున్న కీలక నిర్ణయమని ఆమె పేర్కొన్నారు. గత పదేళ్లలో భారత్ 'వికాస్ – విరాసత్'ను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగిందని రాష్ట్రపతి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడినట్లు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత కార్యక్రమంగా గుర్తింపు పొందిన ప్రధానమంత్రి జనధన్ యోజన కింద దాదాపు 59 కోట్ల బ్యాంకు ఖాతాలు ప్రారంభమయ్యాయని, అందులో 32 కోట్లకు పైగా ఖాతాలు మహిళలకు చెందినవని వివరించారు. మౌలిక వసతుల అభివృద్ధి పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు ఉపాధి అవకాశాల సృష్టికి దోహదపడుతోందన్నారు. ఇటీవలి పరీక్షా వ్యవస్థలో చోటుచేసుకున్న పేపర్ లీక్‌లు, అవకతవకలను ప్రస్తావించిన రాష్ట్రపతి.. పరీక్షల్లో పారదర్శకతను పెంచేందుకు, అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. 35 ఏళ్లలోపు యువత దేశ జనాభాలో సుమారు 65 శాతం ఉన్నారని, స్టార్టప్ వ్యవస్థకు యువతే ప్రధాన చోదక శక్తిగా నిలుస్తున్నారని అన్నారు. దేశ భవిష్యత్తును యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరిగి ప్రజాస్వామ్య పునాదులు బలోపేతం అవుతున్నాయని రాష్ట్రపతి అన్నారు. క్రీడల నుంచి రక్షణ రంగం వరకు మహిళలు సాధిస్తున్న విజయాలను ఆమె ప్రశంసించారు. దేశ అంతర్గత భద్రతలో మావోయిజం ప్రభావం తగ్గడం చారిత్రక విజయమని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఒకప్పుడు మావోయిజం ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయని తెలిపారు. 'బస్తర్ ఒలింపిక్స్' దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. 'ఖేలో ఇండియా' వంటి కార్యక్రమాలతో దేశంలో క్రీడా వ్యవస్థ బలోపేతమైందని, అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారుల ప్రదర్శన గణనీయంగా మెరుగుపడుతోందని అన్నారు. ప్రజా భాగస్వామ్యం భారతదేశ సంప్రదాయమని రాష్ట్రపతి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల భాగస్వామ్యంతోనే మరింత విజయవంతం అవుతాయని పేర్కొన్నారు. దేశ విభజన నాటి విషాద పరిస్థితులను గుర్తుచేసుకున్న రాష్ట్రపతి, 500కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు నివాళులర్పించారు. భవిష్యత్ తరాల కోసం సహజ వనరులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. ప్రసంగం ప్రారంభంలో పార్శీ నూతన సంవత్సరం 'నవ్రోజ్' సందర్భంగా దేశ, సోదర సోదరీమణులకు రాష్ట్రపతి శుభాకాంక్షలు తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణం కోసం దేశ ప్రజల ఐక్యత, కృషి, బాధ్యతాయుత భాగస్వామ్యం అత్యవసరమనే సందేశాన్ని రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రధానంగా వినిపించారు.

## హిందూ కుటుంబాలకు వేధింపులు.. మైనారిటీలకు ఉచిత విద్యుత్తా?

హైదరాబాద్, ఆగస్టు 14 (ఈవార్తలు): పాతబస్తీలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఉచిత విద్యుత్ పథకం అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన... కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామనే రీతిలో సీఎం మాట్లాడటాన్ని రాంచందర్ రావు తప్పుబట్టారు. నిబంధనలు పాటించడం లేదని, నిబంధనల సాకుతో హైడ్రా ద్వారా పేద హిందూ కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు చూపించని ఎందుకు చూపిస్తున్నారని నిలదీశారు.

# అత్యుత్తమ పోలీసు సేవకు రాష్ట్రపతి పోలీస్ మెడల్

## కరీంనగర్ అదనపు డీసీపీ పి. వెంకట రమణకు 'ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్'

కరీంనగర్, ఆగస్టు 14 (ఈవార్తలు): పోలీస్ శాఖలో అత్యుత్తమ సేవలు, అంకితభావం, సమర్థవంతమైన విధి నిర్వహణకు గుర్తింపుగా కరీంనగర్ కమిషనరేట్ అదనపు డీసీపీ (అడ్మిన్) పి. వెంకట రమణ ప్రతిష్ఠాత్మక 'ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్'కు ఎంపికయ్యారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ పతకాల్లో భాగంగా ఆయనకు ఈ గౌరవం లభించింది.

**1991లో ఎస్ఐగా ప్రస్థానం**

1991లో సబ్ఇన్స్పెక్టర్‌గా పోలీస్ శాఖలో ప్రస్థానం ప్రారంభించిన వెంకట రమణ హైదరాబాద్ జంట నగరాల్లోని పలు కీలక, మతపరంగా సున్నితమైన ప్రాంతాలతో పాటు టాస్క్‌ఫోర్స్‌లో విధులు నిర్వర్తించారు. 2005లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేశారు. చత్రినాక, ముషీరాబాద్, అంబర్‌పేట్, జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్లలో ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు నిర్వహించారు. 2017లో ఏసీపీగా పదోన్నతి పొందిన ఆయన హైదరాబాద్ ట్రాఫిక్ బ్రాంచ్, గోపాలాపురం, నార్త్ జోన్, టీఎస్ విజిలెన్స్, ఎస్ఆర్ నగర్, వెస్ట్ జోన్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించారు.

**కీలక కేసుల ఛేదనలో కీలక పాత్ర**

సబ్ఇన్స్పెక్టర్‌గా పనిచేసిన సమయంలో మాంద్రక్స్ (ఎన్‌డీపీఎస్) కేసులు, అక్రమ ఆయుధాల స్వాధీనం, నార్త్ ఇండియన్ గ్యాంగ్‌లు, నకిలీ స్టాంపులు, నకిలీ ఇందిరా వికాస్ పత్రాలు, గంజాయి, నకిలీ సర్టిఫికెట్లకు సంబంధించిన కేసుల ఛేదనలో ఆయన కీలక పాత్ర పోషించారు. జడ్చర్ల ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన సమయంలో హత్యలు, హైవే దోపిడీలు, సామూహిక అత్యాచార కేసులను ఛేదించడంతో పాటు సమర్థవంతమైన దర్యాప్తు ద్వారా నిందితులకు శిక్షలు పడేలా కృషి చేశారు.

**ఇప్పటికే పలు పురస్కారాలు**

వెంకట రమణ ఇప్పటికే తెలంగాణ పోలీస్ సేవా పతకం--2010, తెలంగాణ పోలీస్ ఉత్తమ సేవా పతకం--2018, యూనియన్ హోం మినిస్టర్స్ మెడల్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్--2022 వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారు. ఆయన సేవా రికార్డులో 107 నగదు బహుమతులు, ఒక అడ్వాన్స్‌డ్ ఇంక్రిమెంట్, 7 ప్రశంసాపత్రాలు, 4 అభినందనలు, 15 ఎంఎస్ఈలు, 162 జీఎస్ఈలు ఉన్నాయి. 2025 మే 22న అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన, అదే ఏడాది జూన్ 2 నుంచి కరీంనగర్ కమిషనరేట్ అదనపు డీసీపీ (అడ్మిన్)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. క్రమశిక్షణ, అంకితభావం, సమర్థవంతమైన దర్యాప్తు, ప్రజా భద్రత పట్ల నిబద్ధతతో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా వెంకట రమణకు రాష్ట్రపతి పోలీస్ మెడల్ లభించడంపై కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.






## హామీల అమలులో మోదీ ప్రభుత్వం విఫలం: చాడ వెంకట్‌రెడ్డి

జగిత్యాల, ఆగస్టు 14 (ఈవార్తలు): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. జగిత్యాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని, రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల హక్కుల కోసం పోరాడితే లాఠీచార్జీలు, కాల్పులకు పాల్పడుతోందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. నీట్ పరీక్షల లీకేజీ, పార్లమెంట్‌లో ప్రతిపక్షాల గొంతు నొక్కడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమన్నారు. ప్రజల పక్షాన పోరాడటమే సీపీఐ లక్ష్యమని, రానున్న రోజుల్లో మోదీ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. సమావేశంలో మంద సుదర్శన్, వెన్న మహేష్, మహ్మద్ అక్రమాలిక్ తదితరులు పాల్గొన్నారు.




## భారీగా అక్రమ మద్యం స్వాధీనం

**ఒకరి అరెస్టు.. మరో నిందితుడు పరారీ**

జగిత్యాల, ఆగస్టు 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎక్సైజ్, మద్యపాన నిషేధ శాఖ అధికారి కే. తిరుపతి ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు అక్రమ మద్యం విక్రయాలపై దాడులు నిర్వహించారు. కరీంనగర్ నిఘా విభాగం, జగిత్యాల జిల్లా టాస్క్‌ఫోర్స్, మెట్‌పల్లి ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా చేపట్టిన దాడుల్లో భారీగా రుసుము చెల్లించని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కథలాపూర్ మండలం బొమ్మన గ్రామంలోని ఓ గాజుల దుకాణంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించగా 144 మద్యం బాటిళ్లు లభించాయి. మద్యం విక్రయిస్తున్న గంగాధర్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా.. గంభీర్‌పూర్‌కు చెందిన జివ్వాడి శ్రీనివాస్ వద్ద నుంచి మద్యం కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో శ్రీనివాస్ నివాసం, గాజుల దుకాణంలో తనిఖీలు చేపట్టగా మరో 36 మద్యం సీసాలు లభించాయి. గంగాధర్‌గౌడ్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేయగా, ప్రధాన నిందితుడు జివ్వాడి శ్రీనివాస్ పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అతడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దాడుల్లో నిఘా విభాగం అధికారులు నరేందర్, మజీద్, టాస్క్‌ఫోర్స్ అధికారి సీహెచ్ రాజమౌళి, మెట్‌పల్లి ఎక్సైజ్ అధికారులు జి. వినోద్‌రాథోడ్, పి. సందీప్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్త పింఛన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పింది

**దావ వసంత సురేష్**

జగిత్యాల టౌన్, ఆగస్టు 14 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తయినా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకురాలు దావ వసంత సురేష్ విమర్శించారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత పింఛన్‌కు రెట్టింపు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించిందని ఆరోపించారు. కొత్త పింఛన్ల కోసం ప్రజల నుంచి పలుమార్లు దరఖాస్తులు తీసుకోవడం తప్ప మంజూరు చేయడం లేదన్నారు. వృద్ధాప్య, బీడీ కార్మికుల పింఛన్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీడీ కార్మికులకు పింఛన్ అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. అలాగే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2,500 ఇస్తామన్న హామీని అమలు చేయాలని కోరారు. కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. అర్హులైన దివ్యాంగులకు పింఛన్లు అందేలా మండలాల వారీగా సదరం శిబిరాలు నిర్వహించాలని కోరారు. కేసీఆర్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆరోపించారు. ప్రజల నుంచి వస్తున్న అసంతృప్తిని తగ్గించేందుకే కొత్త పింఛన్ల పేరుతో ప్రభుత్వం హడావుడి చేస్తోందని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తేలు రాజు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సాగి సత్యంరావు, నాయకులు జగన్, గంగారెడ్డి, రామచంద్రరెడ్డి, రమేష్, భాస్కర్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ రమేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జగిత్యాలకు మంత్రి అజారుద్దీన్

**స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరు**

జగిత్యాల, ఆగస్టు 14 (ఈవార్తలు): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న వేడుకలకు రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ హాజరుకానున్నారు. ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం పోలీస్ కవాతును తిలకించి స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని ఇవ్వనున్నారు. వేడుకలకు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు హాజరుకానున్నారు.



# గంగాజలంతో శుద్ధిపై కాంగ్రెస్ నిరసన

## ఖర్గే పాల్గొన్న ప్రాంగణాన్ని శుద్ధి చేయడం అవమానకరం.. జగిత్యాల డీసీసీ ప్రెసిడెంట్ గాజంగి నందయ్య




జగిత్యాల, ఆగస్టు 14 (ఈవార్తలు): ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ర్యాలీ ప్రాంగణాన్ని గంగాజలంతో శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ జగిత్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్న ప్రాంగణాన్ని గంగాజలంతో శుద్ధి చేయడం దళిత నేతను అవమానించడమేనని డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య అన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు పాత బస్టాండ్ నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్ర నిర్వహించి అనంతరం సత్యాగ్రహం చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గాజంగి నందయ్య మాట్లాడుతూ.. ఖర్గే పాల్గొన్న కార్యక్రమం అనంతరం ప్రాంగణాన్ని గంగాజలంతో శుద్ధి చేయడం దళితుల ఆత్మగౌరవాన్ని అవమానించడమేనన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని గౌరవిస్తున్నామని చెప్పే బీజేపీ నేతలు ఇలాంటి చర్యలను ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించారు. ఇది కేవలం ఖర్గేను అవమానించడం మాత్రమే కాకుండా రాజ్యాంగ విలువలు, సమానత్వ స్ఫూర్తిని అవమానించడమేనని పేర్కొన్నారు. దేశంలో సామాజిక న్యాయం, సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, ముకేష్ కన్నా, మన్సూర్, దుమాల రాజ్‌కుమార్, బీరం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ దళిత వ్యతిరేకి: కాంగ్రెస్ నేతలు

**బన్సీలాల్‌పేటలో నిరసన ప్రదర్శన**

**ఖర్గే సభా ప్రాంగణం 'శుద్ధి' చేయడంపై కాంగ్రెస్ ఆగ్రహం**




బన్సీలాల్‌పేట, ఆగస్టు 14 (ఈవార్తలు): ఉత్తరాఖండ్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ ముగిసిన అనంతరం సభా ప్రాంగణాన్ని 'శుద్ధి' చేయడంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ దళిత వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ ఆధ్వర్యంలో శుక్రవారం సనత్‌నగర్ నియోజకవర్గంలోని బన్సీలాల్‌పేట జబ్బర్ కాంప్లెక్స్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు భారీ సత్యాగ్రహ దీక్ష చేపట్టాయి. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్, పీసీసీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కోట నీలిమ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. దీక్షలో భాగంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 10 నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైబిల్ హౌస్ వరకు భారీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తవుతున్నా బీజేపీ మనస్తత్వంలో అంటరానితనం, దళిత వ్యతిరేక భావజాలం కొనసాగడం బాధాకరమని అన్నారు. రాజ్యసభ ప్రతిపక్ష నేతగా ఉన్న మల్లికార్జున్ ఖర్గే పట్ల బీజేపీ శ్రేణులు వ్యవహరించిన తీరును వారు తీవ్రంగా ఖండించారు. బీజేపీ పాలనలో దళితులపై అరాచకాలు, వివక్ష పెరిగిపోయాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను సహించేది లేదని, సామాజిక సమానత్వం కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.



## శ్రావణ శుక్రవారం వేళ ప్రత్యేక పూజలు

జగిత్యాల, ఆగస్టు 14 (ఈవార్తలు): శ్రావణ మాసం విదియ సందర్భంగా జగిత్యాల పట్టణం చింతకుంట చెరువు సమీపంలోని శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, పాలాభిషేకం నిర్వహించడంతో పాటు లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. పారాయణం అనంతరం మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని కుంకుమ పూజ అనంతరం లక్కీడిప్ నిర్వహించి ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. అలాగే అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం, తాంబూలాన్ని ఆలయ అర్చకుల ఆశీర్వచనాలతో భక్తులకు అందజేశారు. అనంతరం అమ్మవారికి ముడుపులు కట్టారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు వొడ్నాల లత, వడ్లగట్ట స్వాతి, సుజాత, అంజలి, వనజ, హర్షిణి, ప్రసన్న, కావ్య, మాధురి, శిరీష, తార, సంధ్య, అనురాధ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు శ్రీహరి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

## హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో జాతీయ జెండా ఆవిష్కరణ

**భారత్ సురక్ష సమితి కార్యాలయంపై త్రివర్ణ పతాకం**

జగిత్యాల టౌన్, ఆగస్టు 14 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా భారత్ సురక్ష సమితి కార్యాలయంపై జాతీయ జెండాను ఎగురవేశారు. భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా చిట్ల గంగాధర్, ఏసీఎస్ రాజు మాట్లాడుతూ.. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ప్రజల్లో జాతీయ భావన, దేశ ఐక్యతను మరింత బలోపేతం చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవిస్తూ దేశం పట్ల తమ బాధ్యతను చాటాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు, దేశ ప్రజల ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. యువత స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అరవ లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపెల్లి కాశీ నదం, జిల్లా కార్యదర్శి సింగం గంగాధర్‌తో పాటు వేముల పొచ్చామల్లు, ఎడమల వెంకట్‌రెడ్డి, నారెందుల శ్రీనివాస్, వేముల దేవరాజం, గొల్లపల్లి సత్యనారాయణ, కేఆర్ కృష్ణ, గడసు భుమన్న, చిలుక రాజన్న తదితరులు పాల్గొన్నారు.





## నూతన పంచాయతీ భవనం ప్రారంభం

**ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్**

జగిత్యాల రూరల్, ఆగస్టు 14 (ఈవార్తలు): మండలంలోని వంజరపల్లి గ్రామంలో రూ.20 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు పంచాయతీ భవనాలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య, సర్పంచ్ అదరవేని గంగమల్లయ్య, ఉపసర్పంచ్ బొల్లె తిరుపతి భీమవ్వ, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, ఎంపీడీవో రమాదేవి, తహసీల్దార్ హకీం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాలముకుందం, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సదాశివరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ నక్కల రవీందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కట్ట రాజేందర్, మాజీ ఎంపీపీ మహేష్, పలువురు సర్పంచులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎండపల్లి బీఆర్ఎస్ అధ్యక్ష రేసులో వెంకటేశ్ యాదవ్?

ఎండపల్లి, ఆగస్టు 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవికి గొడిశెలపేటకు చెందిన సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు అల్లె వెంకటేశ్ యాదవ్ పేరు వినిపిస్తోంది. పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా పనిచేస్తున్న ఆయన.. తెలంగాణ ఉద్యమంలోనూ చురుకుగా పాల్గొన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అనుచరుడిగా ఉంటూ పలు ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేశారని నాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎండపల్లి మండల యాదవ సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న వెంకటేశ్ యాదవ్ ఆరుసార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని వివిధ వర్గాలతో సత్సంబంధాలు ఉండటంతో ఆయనకు పార్టీ బాధ్యతలు అప్పగిస్తే స్తబ్దతలో ఉన్న కార్యకర్తలను తిరిగి క్రియాశీలం చేయవచ్చని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. మండల అధ్యక్ష పదవి ఈసారి కూడా బీసీ సామాజిక వర్గానికి కేటాయిస్తే అల్లె వెంకటేశ్ యాదవ్‌కు అవకాశం ఇవ్వాలని కార్యకర్తలు కోరుతున్నారు. ఆయనకు అవకాశం దక్కుతుందా? బీఆర్ఎస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తిగా మారింది.



## జాతీయ కరాటే పోటీల్లో అన్విత్ పటేల్‌కు గోల్డ్ మెడల్



హైదరాబాద్, ఆగస్టు 14 (ఈవార్తలు): జాతీయ స్థాయి షోటోఖాన్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన విద్యార్థి లక్కాకుల అన్విత్ పటేల్ ప్రతిభ చాటాడు. బెంగళూరులో జపాన్ కరాటే షోటోఖాన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 15వ జాతీయ స్థాయి షోటోఖాన్ కరాటే ఓపెన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న అన్విత్ పటేల్ రెండు పతకాలు సాధించాడు. బర్కత్‌పురలోని శ్రీచైతన్య స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న అన్విత్ పటేల్ కుమితి విభాగంలో ప్రథమ బహుమతి (గోల్డ్ మెడల్), కటా విభాగంలో ద్వితీయ బహుమతి (సిల్వర్ మెడల్) సాధించాడు. అన్విత్ పటేల్ కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో మాస్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి వద్ద కరాటేలో శిక్షణ పొందుతున్నాడు. జాతీయ స్థాయిలో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన అన్విత్ పటేల్‌ను శుక్రవారం శ్రీచైతన్య స్కూల్ బర్కత్‌పుర ప్రిన్సిపాల్ ఆకుల మాధవీదేవి అభినందించి సన్మానించారు. తమ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం పాఠశాలకు గర్వకారణమని ఆమె అన్నారు. కార్యక్రమంలో స్కూల్ డీన్ గాయత్రి, సి-బ్యాచ్ ఇన్‌చార్జి వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం

## స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై ప్రధాని మోదీ ప్రశంసలు.. ప్రసంగం దేశ సుస్థిరతను ప్రతిబింబిస్తోందన్న ప్రధాని





న్యూఢిల్లీ: 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ఆలోచనలు దేశ బలానికి, ప్రతి భారతీయుడి ఆకాంక్షలకు నిదర్శనమని ఆయన కొనియాడారు. శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని స్పందించారు. "స్వాతంత్ర్య దినోత్సవ వేళ రాష్ట్రపతి చాలా ఉత్తేజకరమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. ఆమె ఆలోచనలు మన దేశ శక్తిని, ప్రతి భారతీయుడి ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. వికసిత భారత్ నిర్మాణం కోసం పునరంకిత భావంతో పనిచేయడానికి ఆమె సందేశం మనందరికీ స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. అంతకుముందు, తన ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత దశాబ్ద కాలంలో దేశం సాధించిన ప్రగతిని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారతదేశం వేగవంతమైన, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధించిందని తెలిపారు. "వికాస్ మరియు విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) సమన్వయంతో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. 'వికసిత భారత్ ఏ 2047' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలు, యువత, పేదలు, రైతుల సంక్షేమ పథకాలను రాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. గత పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' కింద సుమారు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో వారి భాగస్వామ్యం పెరిగిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని అన్నారు. ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని తెలిపారు. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని, వారి శక్తితో స్టార్టప్ వ్యవస్థ దేశ స్వర్ణ భవిష్యత్తుకు బాటలు వేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ యవనికపై భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు పౌరులందరూ తమ వంతు కృషి చేయాలని రాష్ట్రపతి తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

## 'రెడ్ లైన్' దాటితే వరల్డ్ మ్యాప్‌లోనే ఉండరు

**పాకిస్థాన్‌కు భారత నేతల తీవ్ర హెచ్చరిక**

న్యూఢిల్లీ: సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో పాకిస్థాన్ చేసిన బెదిరింపు వ్యాఖ్యలపై భారత రాజకీయ నేతలు తీవ్రంగా స్పందించారు. ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా పాకిస్థాన్‌ను ప్రపంచ పటం నుంచే తుడిచిపెడతామని పార్టీలకతీతంగా నేతలు ముక్తకంఠంతో హెచ్చరించారు. సింధు జలాల అంశం తమ దేశానికి "రెడ్ లైన్" అని, ఈ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలకు భారత నేతలు గట్టిగా బదులిచ్చారు. పాకిస్థాన్ తన గడ్డపై నుంచి ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టేంత వరకు సింధు జలాల ఒప్పందం నిలిపివేతలోనే ఉంటుందని భారత్ ఎప్పటినుంచో స్పష్టం చేస్తోంది. ఈ విషయంపై ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడిన కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, "భారత్ తన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగానే పనిచేస్తుంది. అసలు పాకిస్థాన్ స్థాయి ఎంత? ప్రపంచంలో ఏ శక్తి ఉన్నా సరే.. మేము మా ప్రయోజనాల కోసమే పనిచేస్తాం, వాటిని దృఢంగా కాపాడుకుంటాం" అని తేల్చిచెప్పారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్.పి. సింగ్ పాకిస్థాన్‌ను విమర్శిస్తూ, "గతేడాది జరిగిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ పరిస్థితి ఏమైందో షెహబాజ్ షరీఫ్ మరిచిపోయి ఉండొచ్చు. వారి ఉగ్రవాద మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలు ఎలా ధ్వంసమయ్యాయో గుర్తు చేసుకోవాలి. ఇప్పుడు ఎలాంటి దుస్సాహసానికి ప్రయత్నించినా, పాకిస్థాన్ ప్రపంచ పటం నుంచే శాశ్వతంగా కనుమరుగవుతుంది" అని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. కాంగ్రెస్ ఎంపీ తారిఖ్ అన్వర్ కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "భారత్ ఈ ఒప్పందాన్ని నిలిపివేయడానికి బలమైన కారణం ఉంది. పాకిస్థాన్ వైపు నుంచి ఉగ్రవాద కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇటీవల కశ్మీర్‌లో అమాయకుల ప్రాణాలను బలిగొన్న దాడుల నేపథ్యంలో, పాకిస్థాన్‌తో సంబంధాలు కొనసాగించడం భారత్‌కు చాలా కష్టం" అని ఆయన వివరించారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ, "'ఆపరేషన్ సిందూర్'లో మన భారత సైన్యం వారికి ఎరుపు, పసుపు, నీలం.. అన్ని రకాల లైన్లను ఎలా చూపించిందో మీరు చూసే ఉంటారు. కాబట్టి, పాకిస్థాన్ చెప్పేది భారత్ సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. వారు చేసే ప్రతి పనికి వెయ్యి రెట్ల బలంతో గట్టి సమాధానం చెప్పే సామర్థ్యం భారత్‌కు ఉంది. ఈ విషయంలో యావత్ దేశం భారత ప్రభుత్వానికి, భారత సైన్యానికి అండగా నిలుస్తుంది" అని ఐఏఎన్ఎస్‌కు తెలిపారు. ఇటీవల, అమెరికాలో భారత రాయబారి వినయ్ క్వాత్రా మాట్లాడుతూ, 1960లో సద్భావన, స్నేహ స్ఫూర్తితో ఈ ఒప్పందం కుదిరిందని, కానీ గత 50 ఏళ్లుగా పాకిస్థాన్ ఈ స్ఫూర్తిని నాశనం చేసిందని పేర్కొన్నారు. ఒప్పందాన్ని నిలిపివేయడం అనేది పాకిస్థాన్ ప్రవర్తన వల్ల ఇప్పటికే నాశనమైన వాస్తవాన్ని అంగీకరించడమేనని ఆయన వ్యాఖ్యానించారు.

## రూ.లక్షకు రూ.4 లక్షలు

**గోల్డ్ బాండ్ల పంట పండింది**



న్యూఢిల్లీ: సావరీన్ గోల్డ్ బాండ్లలో (ఎస్జీబీ) పెట్టుబడి పెట్టిన వారికి కనకవర్షం కురిసింది. 2019 ఆగస్టు 14న జారీ చేసిన ఎస్జీబీ 2019-20 సిరీస్-3 ముందస్తు ఉపసంహరణ (ప్రీమెచ్యూర్ రిడెంప్షన్) ధరను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించింది. ఈ బాండ్లను కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లు 2026 ఆగస్టు 14 నుంచి తమ పెట్టుబడులను నగదుగా మార్చుకోవచ్చని తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి యూనిట్ (గ్రాము) ఇష్యూ ధర రూ. 3,449 కాగా, ఇప్పుడు దాని రిడెంప్షన్ ధరను రూ. 15,310గా ఆర్బీఐ నిర్ణయించింది. అంటే, ఏడేళ్ల వ్యవధిలో పెట్టుబడి విలువ ఏకంగా నాలుగింతలకు పైగా పెరిగింది. ప్రతి యూనిట్‌పై నికరంగా రూ. 11,861 లాభం వచ్చినట్లు లెక్క. శాతం పరంగా చూస్తే ఇది సుమారు 343.9 శాతం రాబడితో సమానం. ఈ లాభం కేవలం బంగారం ధరల పెరుగుదల వల్ల వచ్చింది మాత్రమే. దీనికి పెట్టుబడి కాలంలో లభించిన 2.5 శాతం వార్షిక వడ్డీ అదనం. ఉదాహరణకు, ఒక ఇన్వెస్టర్ ఆ సమయంలో లక్ష రూపాయలు పెట్టుబడిగా పెట్టి ఉంటే, వారికి సుమారు 28.99 యూనిట్లు కేటాయించి ఉంటారు. ప్రస్తుత రిడెంప్షన్ ధర ప్రకారం ఆ పెట్టుబడి విలువ రూ. 4.44 లక్షలకు చేరుకుంది. అంటే, వడ్డీని మినహాయిస్తేనే నికరంగా రూ. 3.44 లక్షల లాభం వచ్చినట్టు. వార్షికంగా ఇది సుమారు 23.7 శాతం రాబడితో సమానం. సాధారణంగా ఎస్జీబీల మెచ్యూరిటీ కాలం 8 సంవత్సరాలు ఉంటుంది. కానీ, జారీ చేసిన ఐదేళ్ల తర్వాత వడ్డీ చెల్లింపు తేదీలలో ముందస్తుగా ఉపసంహరించుకునే వెసులుబాటును ఆర్బీఐ కల్పిస్తుంది.



## స్టాక్ మార్కెట్లకు స్వల్ప నష్టాలు

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలో ముడిచమురు ధరలు పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. హర్మూజ్ జలసంధిలో అమెరికా నౌకాదళం దిగ్బంధనాన్ని నిరవధికంగా కొనసాగించవచ్చన్న వార్తలు మదుపరుల్లో ఆందోళన పెంచాయి. దీంతో ఇంధన సరఫరా, ద్రవ్యోల్బణంపై భయాలు మార్కెట్లపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ 71 పాయింట్లు నష్టపోయి 78,009.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 29.85 పాయింట్లు తగ్గి 24,366 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 24,405 స్థాయిని తాకినా.. అమ్మకాల ఒత్తిడితో కిందకు దిగొచ్చింది. నిఫ్టీకి 24,300-24,250 స్థాయి కీలక మద్దతుగా ఉంటుందని మార్కెట్ నిపుణులు తెలిపారు. 24,400 ప్రాంతంలో నిరోధం కొనసాగుతోందని పేర్కొన్నారు. ముడిచమురు ధరల పెరుగుదల భారత్‌కు ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారుల్లో భారత్ ఒకటి కావడంతో క్రూడ్ ధరలు పెరిగితే దిగుమతి వ్యయం పెరిగే అవకాశం ఉంది. హర్మూజ్ జలసంధి పరిణామాలు ఈ ఒత్తిడిని మరింత పెంచుతున్నాయి. నిఫ్టీలో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ఓఎన్‌జీసీ షేర్లు నష్టాల్లో నిలిచాయి.

## సెప్టెంబరులో భారత్‌కు ఇరాన్ అధ్యక్షుడు!

టెహ్రాన్: ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సెప్టెంబరులో భారత్‌కు రానున్నట్లు సమాచారం. ఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సులో ఆయన పాల్గొననున్నట్లు ఏఎన్ఐ వార్తాసంస్థ వెల్లడించింది. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన భారత్.. 18వ శిఖరాగ్ర సమావేశానికి ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్ అధ్యక్షతన జరిగే ఈ సదస్సు 'బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ' అనే అజెండాతో సాగనుంది. 2026 ఆరంభంలో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్ నుంచి భారత్ స్వీకరించింది. పెజెష్కియాన్ పర్యటనకు మరో ప్రాధాన్యం ఉంది. 2024 అక్టోబరులో రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఆయన ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలతో పాటు ప్రాంతీయ పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఇరాన్ 2024లో బ్రిక్స్‌లో పూర్తిస్థాయి సభ్యత్వం పొందింది. అదే సమయంలో ఈజిప్ట్, ఇథియోపియా, యూఏఈ కూడా కూటమిలో చేరాయి.

## కరూర్ బాధితులకు జాబ్స్ ఇవ్వొచ్చు

**సుప్రీంలో విజయ్‌కు భారీ ఊరట**




న్యూఢిల్లీ: తమిళనాడులో ముఖ్యమంత్రి దళపతి విజయ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. గతేడాది సెప్టెంబర్‌లో కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన 41 మంది మృతుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించింది. ఈ విషయంలో గతంలో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ పరిణామం తమిళ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. గతేడాది సెప్టెంబర్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా టీవీకే అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ కరూర్‌లో పర్యటించారు. ఆ సమయంలో విజయ్ ని చూసేందుకు భారీగా జనం ఎగబడటంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 8 మంది పిల్లలతో సహా మొత్తం 41 మంది దుర్మరణం చెందారు. మరో 46 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. అయితే తన కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారికి ఆధారం చూపాలని భావించిన ముఖ్యమంత్రి విజయ్ ప్రమాదం జరిగినప్పుడే వ్యక్తిగతంగా నష్టపరిహారం చెల్లించారు. ఇదే సమయంలో గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించారు. సుమారు 38 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తూ కరూర్ లోనే నియామక పత్రాలు అందజేశారు. అయితే మానవతా దృక్పథంతో ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలపై మద్రాస్ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. మృతుల కుటుంబ సభ్యులకు కారుణ్య ప్రాతిపదికన ఎలా ఉద్యోగాలు ఇస్తారని ప్రశ్నిస్తూ, ఈ నియామకాలు చెల్లవని తీర్పునిచ్చింది. ఏప్రిల్ లో ముఖ్యమంత్రి విజయ్ బాధిత కుటుంబ సభ్యులకు ఉద్యోగ నియామకపత్రాలు అందజేయగా, జులై 27న మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్ సంచలన తీర్పునిచ్చింది. రాజ్యాంగంలోని 14, 16 ఆర్టికల్స్‌కు విరుద్ధంగా ఉద్యోగాలు ఇచ్చారని తేల్చిచెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఇప్పటికే క్యూలో ఉన్న నిరుద్యోగుల హక్కులను ఇది దెబ్బతీస్తుందని పేర్కొంది. ఈ తరహా నియామకాలు భవిష్యత్తులో మరిన్ని డిమాండ్లకు దారితీస్తాయని భావిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులను రద్దు చేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. మానవతా దృక్పథంతో ఇచ్చిన ఉద్యోగాలను రద్దు చేయడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం హైకోర్టు తీర్పుపై స్టే విధించింది. అంతేకాకుండా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా అత్యున్నత ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసిందని చెబుతున్నారు. "ఇదొక పెద్ద విషాదం. తొక్కిసలాటలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. బాధితులను ఆదుకోవడానికి ప్రభుత్వం నష్టపరిహారంతోపాటు ఉపాధి కల్పిస్తే తప్పేముంది? ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించడానికి మీరెవరు?" అని నిలదీసింది. కుటుంబంలో సంపాదనరుడు మరణించినప్పుడు, ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవడంలో తప్పేంటని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు తాజా నిర్ణయంతో విజయ్ ప్రభుత్వానికి పెద్ద ఊరట లభించినట్లయింది.




## బంగ్లాదేశ్‌కు భారత రైల్వే కోచ్‌లు

**పదేళ్ల తర్వాత సరఫరా పునఃప్రారంభం**

న్యూఢిల్లీ/ఢాకా: దశాబ్ద కాలం విరామం తర్వాత భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు ప్యాసింజర్ రైల్వే కోచ్‌ల సరఫరా మళ్లీ ప్రారంభమైంది. ఇందులో భాగంగా, 19 అత్యాధునిక బ్రాడ్-గేజ్ ప్యాసింజర్ కోచ్‌లతో కూడిన మొదటి బ్యాచ్‌ను సరిహద్దు ద్వారా బంగ్లాదేశ్‌కు పంపినట్లు అక్కడి స్థానిక మీడియా శుక్రవారం వెల్లడించింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసేదిగా నిలుస్తోంది. ఈ కోచ్‌లను పంజాబ్‌లోని కపుర్తలా రైల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారు చేశారు. బంగ్లాదేశ్ రైల్వే వ్యవస్థను ఆధునికీకరించే లక్ష్యంతో 200 కొత్త ప్యాసింజర్ కోచ్‌లను కొనుగోలు చేసే ప్రాజెక్టులో భాగంగా ఈ సరఫరా జరిగింది. బంగ్లాదేశ్‌లోని 'డైలీ సన్' పత్రిక కథనం ప్రకారం, ఈ కొత్త కోచ్‌ల రాకతో నైరుతి ప్రాంతంలో, ముఖ్యంగా పద్మ రైలు వంతెన మీదుగా నడిచే రైల్వే సేవలు మరింత సమర్థవంతంగా, నమ్మకంగా మారనున్నాయి. మొత్తం 200 బ్రాడ్-గేజ్ కోచ్‌ల కొనుగోలు కోసం బంగ్లాదేశ్ 2022లో ఒక ప్రాజెక్టును ప్రారంభించింది. దీని అంచనా వ్యయం 1,704.66 కోట్ల బంగ్లాదేశ్ టాకాలు కాగా, ఇందులో దాదాపు 1,331 కోట్ల టాకాలను యూరోపియన్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణంగా సమకూరుస్తోంది. ఈ మేరకు బంగ్లాదేశ్ రైల్వే, భారత ప్రభుత్వ రంగ సంస్థ రైట్స్ లిమిటెడ్ మధ్య ఈ ఏడాది మే నెలలో ఢాకాలో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం, రైట్స్ సంస్థ కేవలం కోచ్‌లను సరఫరా చేయడమే కాకుండా, వాటి డిజైన్, విడిభాగాలు, సిబ్బందికి శిక్షణ వంటి సాంకేతిక సహాయాన్ని కూడా అందించాల్సి ఉంటుంది. కోచ్‌ల సరఫరాకు 36 నెలలు, ఆ తర్వాత 24 నెలల వారంటీ వ్యవధి ఉంటుంది. అయితే, 2022 మార్చిలో ప్రాజెక్టుకు ఆమోదం లభించినా, ఒప్పందం కుదరడానికి రెండేళ్లకు పైగా సమయం పట్టింది. తాజాగా ఒప్పందం అమల్లోకి రావడంతో కపుర్తలా ఫ్యాక్టరీలో తయారైన తొలి బ్యాచ్ బంగ్లాదేశ్‌కు చేరింది. ఈ బ్యాచ్‌లో 3 ఏసీ స్లీపర్ కోచ్‌లు, 3 ఏసీ చైర్ కార్లు, 11 నాన్-ఏసీ చైర్ కార్లు, 2 పవర్ కార్లు ఉన్నాయి. చివరిసారిగా 2015-16లో భారత్ 120 కోచ్‌లను బంగ్లాదేశ్‌కు సరఫరా చేసింది. చాలా కాలంగా పాత కోచ్‌లతో ఇబ్బందులు పడుతున్న బంగ్లాదేశ్ రైల్వే, ఈ కొత్త కోచ్‌లతో తమ సేవలను మెరుగుపరచుకోవాలని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## నడ్డాకు అస్వస్థత

న్యూఢిల్లీ: కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా అస్వస్థతకు గురయ్యారు. దీంతో గురువారం సాయంత్రం ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరారు. వైద్యులు ఆయనకు కరోనరీ యాంజియోగ్రఫీ నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఎయిమ్స్ వెల్లడించింది. ఎయిమ్స్ కార్డియాలజీ విభాగంలో నడ్డా చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారు. అస్వస్థతకు కారణాలపై వైద్యులు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి తెలిపింది. ఆగస్టు 13 సాయంత్రం నడ్డాకు అస్వస్థతగా అనిపించడంతో పరీక్షలు నిర్వహించినట్లు ఎయిమ్స్ అధికారిక ప్రకటనలో పేర్కొంది.

## గుట్కా నిషేధంపై కర్ణాటక యూటర్న్

**నాకు తెలియకుండా ఇంత పెద్ద నిర్ణయమా?**

**అధికారులపై డీకే శివకుమార్ ఫైర్**

బెంగళూరు: కర్ణాటకలో గుట్కా నిషేధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేసిన కొద్ది రోజులకే ప్రభుత్వం వెనక్కి తగ్గేందుకు సిద్ధమైంది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని వక్క (అడక) రైతులు తీవ్రంగా నష్టపోతారని అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. గుట్కా నిషేధ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు ప్రభుత్వ వర్గాలు శుక్రవారం తెలిపాయి. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై తీవ్ర చర్చ జరిగినట్లు సమాచారం. ఇంతటి కీలకమైన నిర్ణయం తన దృష్టికి రాకుండా ఎలా జారీ చేశారని సీఎం అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఆరోగ్యశాఖ కార్యదర్శిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్వులు జారీ చేసే ముందు తనతో ఎందుకు చర్చించలేదని నిలదీశారు. రాష్ట్రంలోని ఏడెనిమిది జిల్లాల్లో రైతులు పూర్తిగా వక్క సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారని ఆయన గుర్తుచేశారు. అంతకుముందు కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి గుట్కా నిషేధం వల్ల వక్క రైతులకు జరిగే నష్టంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం గురించి తనకు తెలియదని, సమస్యను పరిష్కరిస్తానని సీఎం వారికి హామీ ఇచ్చారు. తమతో సంప్రదించకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోవడంపై ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిణామంపై మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ ఎంపీ బసవరాజ్ బొమ్మై స్పందిస్తూ.. ప్రజారోగ్యం, రైతుల ప్రయోజనాల మధ్య ప్రభుత్వం సమతుల్యం పాటించాలని సూచించారు. "ఆరోగ్యం ముఖ్యమే, కానీ వక్క రైతుల ప్రయోజనాలను కూడా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఒకప్పుడు మల్నాడు ప్రాంతానికే పరిమితమైన వక్క సాగు, ఇప్పుడు రాష్ట్రంలోని చాలా జిల్లాలకు విస్తరించింది. రైతులు ఐదేళ్ల పాటు పెట్టుబడి పెట్టి పంట కోసం ఎదురుచూస్తారు. ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలు వారిని తీవ్రంగా దెబ్బతీస్తాయి. ఒకవేళ నిషేధం అమలు చేయాలనుకుంటే రైతులకు నష్టపరిహారం అందించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. వక్క రైతుల ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే, ముఖ్యంగా మల్నాడు ప్రాంతంలో తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుందని జేడీఎస్ ఎమ్మెల్యే ఎ. మంజు హెచ్చరించారు. "రైతుల ఆందోళనలకు మేం మద్దతిస్తాం. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి" అని ఆయన కోరారు. మరోవైపు, గుట్కా నిషేధం వార్తలతో వినియోగదారులు ఆందోళనకు గురై, పెద్ద మొత్తంలో కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటున్నారు. కొందరైతే బస్తాల్లో గుట్కా ప్యాకెట్లను తీసుకెళుతున్న దృశ్యాలు కనిపించాయి. ఈ వివాదం నేపథ్యంలో, ఉన్నతస్థాయి సమావేశం అనంతరం ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## రాహుల్ సావర్కర్ వ్యాఖ్యల కేసు కొట్టివేత

న్యూఢిల్లీ: సావర్కర్‌పై వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై కొనసాగుతున్న క్రిమినల్ పరువునష్టం కేసును సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. కేసు కొనసాగించేందుకు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా తీసుకోవాల్సిన అనుమతి పొందలేదని కోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. అవసరమైన ప్రభుత్వ అనుమతి లేకుండా కేసు కొనసాగించలేమని పేర్కొంటూ రాహుల్ గాంధీ పిటిషన్‌ను అనుమతించింది. దీంతో దిగువ కోర్టు జారీ చేసిన సమన్లను కూడా రద్దు చేసింది. 2022లో మహారాష్ట్రలో సాగిన భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ సావర్కర్‌పై వ్యాఖ్యలు చేశారు. సావర్కర్ బ్రిటీషర్లకు సేవకుడిగా వ్యవహరించారని, బ్రిటీష్ ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకునేవారని ఆరోపించారు.

## అమెరికాకు కోలుకోలేని దెబ్బ

**ఇరాన్‌తో యుద్ధంలో 45 'రీపర్' డ్రోన్ల ధ్వంసం**

**రూ. 11 వేల కోట్లకు పైగా నష్టం**

వాషింగ్టన్: ఇరాన్‌తో కొనసాగుతున్న తీవ్ర సైనిక ఘర్షణలో అగ్రరాజ్యం అమెరికాకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా సైనిక పాటవానికి ప్రతీకగా నిలిచే అత్యంత శక్తిమంతమైన ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లలో ఏకంగా 45 డ్రోన్లు ధ్వంసమైనట్లు ప్రముఖ పత్రిక 'వాషింగ్టన్ పోస్ట్' తన కథనంలో వెల్లడించింది. ఇది అమెరికా వద్ద ఉన్న మొత్తం రీపర్ డ్రోన్ల వ్యూహాత్మక బలగంలో పావు వంతు (25 శాతం) కావడంతో పెంటగాన్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ధ్వంసమైన 45 డ్రోన్ల విలువ సుమారు 1.3 బిలియన్ డాలర్లకు పైనే ఉంటుందని అంచనా. అంటే భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.11,000 కోట్లకు పైమాటే. ఒక్కో రీపర్ డ్రోన్ ధర, దానిపై అమర్చిన సెన్సార్లు, ఆయుధాలను బట్టి 30 నుంచి 50 మిలియన్ డాలర్ల వరకు ఉంటుంది. ఈ భారీ నష్టం అమెరికా పన్ను చెల్లింపుదారులపై పెను భారం మోపుతోంది. అగ్రరాజ్యం గర్వంగా చెప్పుకునే ఈ డ్రోన్లు ఇరాన్ ముందు ఎందుకు విఫలమవుతున్నాయనే దానిపై అధికారులు పలు కారణాలను విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా, ఈ డ్రోన్లు చాలా నెమ్మదిగా, తక్కువ ఎత్తులో ప్రయాణించడం వల్ల ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ క్షిపణులకు ఇవి సులభమైన లక్ష్యాలుగా మారుతున్నాయి. కేవలం క్షిపణి దాడులే కాకుండా, సాంకేతిక లోపాలు, కమ్యూనికేషన్ సిగ్నల్స్ కట్ అవ్వడం వల్ల కూడా కొన్ని డ్రోన్లు కూలిపోయినట్లు ఓ అధికారి తెలిపారు. అంతేకాకుండా, మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ జరిపిన దాడుల్లో నేలపై ఉన్న కొన్ని డ్రోన్లు కూడా నాశనమయ్యాయి.

## నెతన్యాహుకు పోటీగా మాజీ ఆర్మీ చీఫ్

గాజా: ఇజ్రాయెల్ రాజకీయాలు అత్యంత రసవత్తరంగా మారాయి. సుదీర్ఘకాలంగా ప్రధానిగా కొనసాగుతున్న బెంజమిన్ నెతన్యాహుకు, ఆ దేశ మాజీ సైన్యాధ్యక్షుడు (ఐడీఎఫ్ చీఫ్) గాడీ ఐజెన్‌కోట్ రూపంలో ఊహించని, బలమైన సవాల్ ఎదురవుతోంది. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఐజెన్‌కోట్, నెతన్యాహుకు ప్రధాన ప్రత్యర్థిగా నిలవడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గాడీ ఐజెన్‌కోట్ ఇజ్రాయెల్ సైనిక, రాజకీయ వర్గాల్లో ఎంతో గౌరవం ఉన్న వ్యక్తి. 1960లో జన్మించిన ఆయన, ప్రఖ్యాత 'గొలానీ బ్రిగేడ్' ద్వారా సైన్యంలో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి 2015 నుంచి 2019 వరకు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) 21వ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. మొరాకో యూదుల సంతతికి చెందిన వ్యక్తి ఈ ఉన్నత పదవిని చేపట్టడం ఇజ్రాయెల్ చరిత్రలో ఇదే తొలిసారి. 2023 గాజా యుద్ధం తర్వాత, నెతన్యాహు నేతృత్వంలోని అత్యవసర వార్ క్యాబినెట్‌లో ఐజెన్‌కోట్ పరిశీలకుల మంత్రిగా చేరారు. అయితే, ఇదే యుద్ధంలో ఆయన తన కుమారుడు గాల్ ఐజెన్‌కోట్‌ను కోల్పోయారు. ఈ విషాదం నుంచి తేరుకోకముందే, యుద్ధ లక్ష్యాల సాధనలో నెతన్యాహు విఫలమయ్యారని, బందీల విడుదలలో జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ 2024 జూన్‌లో వార్ క్యాబినెట్ నుంచి తప్పుకున్నారు.

## వయ్యారి చిత్రం






## ఆమె వల్లే యూత్ మైండ్ టాక్సిక్!

ప్రస్తుతం భారతీయ సినీ వర్గాల్లో ఏ నోట విన్నా దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ పేరే మార్మోగుతోంది. కన్నడ రాకింగ్ స్టార్ యష్ కథానాయకుడిగా నటిస్తున్న అంతర్జాతీయ స్థాయి భారీ యాక్షన్ డ్రామా -టాక్సిక్- చిత్రానికి ఒక నటి దర్శకత్వం వహిస్తుండటమే అందుకు ప్రధాన కారణం.

నటిగా, జాతీయ అవార్డు గ్రహీత అయిన దర్శకురాలిగా పరిశ్రమలో ఇప్పటికే ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న గీతూ -టాక్సిక్- సినిమాతో భారతీయ ప్రేక్షకులలో.. ముఖ్యంగా నేటి యువత మైండ్‌ను తన మేకింగ్ శైలితో విశేషంగా ఆకట్టుకుంటున్నారు. గీతూ మోహన్‌దాస్ సినీ ప్రయాణం నటిగా ప్రారంభమైంది. తమిళంలో మాధవన్ సరసన వచ్చిన -నల దమయంతి- చిత్రంతో పాటు పలు మలయాళ సినిమాల్లో కథానాయికగా అలరించారు. ఆ తర్వాతి కాలంలో ప్రయోగాత్మక మలయాళ చిత్రం -రాపకల్- వంటి సినిమాల్లో లేడీ సూపర్ స్టార్ నయనతారతో కలిసి గీతూ నటించారు. ఆ సమయంలోనే వీరిద్దరి మధ్య బలమైన స్నేహం ఏర్పడింది. నేటికీ గీతూ-నయనతార అత్యంత ఆత్మీయ స్నేహితులుగా కొనసాగుతూ ఒకరి సినీ ప్రయాణానికి మరొకరు మద్దతుగా నిలుస్తున్నారు. నటనలో మంచి గుర్తింపు తెచ్చుకున్నా.. కథలు చెప్పాలనే తపనతో గీతూ దర్శకురాలిగా మారారు. తెరకెక్కించిన తొలి చిత్రం -లైయర్స్ డైస్- రెండు జాతీయ అవార్డులను గెలుచుకోవడమే కాకుండా ఆస్కార్ అవార్డులకు కూడా భారత అధికారిక ఎంట్రీగా ఎంపికై సంచలనం సృష్టించింది. ఆ తర్వాత నివిన్ పౌలీతో తీసిన -మూథోన్- చిత్రం అంతర్జాతీయ వేదికలపై విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతో పాటు.. గీతూలోని ప్రతిభావంతమైన దర్శకురాలిని ప్రపంచానికి పరిచయం చేసింది. ఇప్పుడు యష్‌తో రూపుదిద్దుకుంటున్న -టాక్సిక్- చిత్రాన్ని త్యంత వినూత్నంగా, విజ్యువల్ స్టైలిష్‌గా తెరకెక్కిస్తున్నారు. డార్క్ థీమ్‌తో సాగే యాక్షన్ సీక్వెన్స్.. హాలీవుడ్ స్థాయి మేకింగ్ .. విజువల్స్ యూత్‌లో తీవ్రమైన క్రేజ్‌ను పెంచేశాయి. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ చూసిన ప్రేక్షకులు గీతూ ప్రదర్శించిన టెక్నికల్ విజన్‌కు ఫిదా అవుతున్నారు. -టాక్సిక్- ప్రాజెక్ట్‌తో గీతూ పాన్-ఇండియా స్థాయిలో అగ్ర దర్శకుల సరసన నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. మరోవైపు ఇటీవల సోషల్ మీడియాలో గీతూ మోహన్‌దాస్ రూపాంతరంపై విపరీతమైన చర్చ జరుగుతోంది.





## శ్రీదేవి బయోగ్రఫీ రెడీ

భారతీయ చిత్ర పరిశ్రమలో అతిలోక సుందరిగా.. మొదటి మహిళా సూపర్ స్టార్‌గా చెరగని ముద్ర వేసిన నటి శ్రీదేవి. తనదైన అద్భుత నటన, అందం, అభినయంతో తరాలుగా లక్షలాది మంది అభిమానుల హృదయాలను కొల్లగొట్టారు. బాలనటిగా ప్రస్థానం ప్రారంభించి తమిళ, తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో అగ్ర కథానాయకిగా వెలిగిన శ్రీదేవి భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిభావంతమైన నటీమణులలో ఒకరిగా నిలిచిపోయారు. ఇటీవల శ్రీదేవి జయంతి సందర్భంగా నటి ప్రియాంక చోప్రా అధికారిక జీవిత చరిత్ర (బయోగ్రఫీ) పుస్తకం కవర్ పేజీని సోషల్ మీడియాలో షేర్ చేసారు. ఎంప్రెసే - ది డెఫినిటివ్ బయోగ్రఫీ ఆఫ్ శ్రీదేవి- పేరుతో వస్తున్న ఈ పుస్తకాన్ని ధీరజ్ యు. కుమార్ రచించారు. వెస్ట్‌లాండ్ బుక్స్ ప్రచురిస్తున్న ఈ పుస్తకానికి శ్రీదేవి భర్త, ప్రముఖ నిర్మాత బోనీ కపూర్ పూర్తి మద్దతు తెలిపారు. ఈ కవర్ పేజీపై అమితాబ్ బచ్చన్ ఇచ్చిన ది ఎపిటోమ్ ఆఫ్ అన్‌మిటిగేటెడ్ టాలెంట్ అనే వ్యాఖ్య శ్రీదేవి నట వైదుష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. ఈ వార్తతో శ్రీదేవి జీవితంపై సినిమా రాబోతోందనే ప్రచారం మళ్లీ మొదలైనా.. అది కేవలం పుస్తకం మాత్రమేనని స్పష్టమవుతోంది.





### శనార్తి.. తెలంగాణ
## లవ్ స్టోరీ

'రాజు వెడ్స్ రాంబాయి' ఫేమ్ అఖిల్‌రాజ్, తెలంగాణ జానపద గీతాల ద్వారా పేరు తెచ్చుకున్న నాగదుర్గ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'శనార్తి' శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. సంపత్‌నంది టీమ్ వర్క్స్, శ్రీధనలక్ష్మి ప్రొడక్షన్స్ పతాకాలపై కేవీ శ్రీధర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాజ్‌గణేష్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈ సందర్భంగా ఆవిష్కరించిన టైటిల్ పోస్టర్ 'ఏ టేల్ ఆఫ్ కల్చర్' అనే ట్యాగ్‌లైన్‌తో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వేడుకల్ని ప్రతిబింబించేలా ఉంది. అగ్ర దర్శకుడు, చిత్ర నిర్మాతల్లో ఒకరైన సంపత్‌నంది చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'తెలంగాణ పల్లెల్లో ప్రజలు ఆత్మీయంగా పలకరించుకునే సందర్భంలో ఉపయోగించే పదం 'శనార్తి'. ఈ ప్రేమకథకు ఈ పదం అచ్చంగా సరిపోతుంది. అఖిల్‌రాజ్-నాగదుర్గ జోడీ ఈ కథకు బాగా కుదిరారు' అన్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, సమర్పణ: ఆదిత్య మూవీస్, దర్శకత్వం: రాజ్‌గణేష్ ఉప్పునూత.





## వెకేషన్‌లో ఐశ్వర్య రాజేష్

తెలుగు మూలాలు ఉన్నప్పటికీ తమిళ చిత్రసీమలో స్టార్ హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి ఐశ్వర్యా రాజేష్. గతేడాది విక్టరీ వెంకటేష్ సరసన 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్‌బస్టర్ హిట్‌తో మెప్పించిన ఈ భామ, తాజాగా తన వెకేషన్‌కు సంబంధించిన పిక్స్ పోస్ట్ చేసింది. "వస్తువులను కాదు, అద్భుతమైన జ్ఞాపకాలను మాత్రమే దాచుకోవాలి" అనే క్యాప్షన్‌తో ఆమె షేర్ చేసిన ఈ కూల్ అండ్ స్టైలిష్ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇటీవల విహారయాత్రకు వెళ్లిన ఐశ్వర్య రాజేష్, అక్కడ దిగిన కొన్ని కలర్‌ఫుల్ ఫోటోలను అభిమానులతో పంచుకుంది. అందులో గ్రీన్ కలర్ లెస్ అసిమ్మెట్రికల్ టాప్, డెనిమ్ షార్ట్స్ ధరించి చాలా నేచురల్‌గా, ఎంతో అందంగా కనిపిస్తోంది. ఇక పక్కా హోమ్లీ లుక్‌తో పాటు గ్లామరస్ టచ్ ఉన్న ఈ వెకేషన్ ఫోటోలను చూసి అభిమానులు, నెటిజన్లు ఫిదా అవుతూ లైక్స్, కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

## రాశీ ఖన్నా: 'దొంగ నోట్ల యాపారం'

రాశి ఖన్నా -ఫర్జీ 2- షూటింగ్‌ను అధికారికంగా ప్రారంభించడంతో ఈ బ్లాక్‌బస్టర్ క్రైమ్ థ్రిల్లర్ సీక్వెల్‌పై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. రాజ్ నిడిమోరు- కృష్ణ డికే దర్శకత్వంలో వచ్చిన -ఫర్జీ- మొదటి సీజన్ 2023లో అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలై గొప్ప ప్రజాదరణ పొందిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రెండవ సీజన్ కోసం చిత్రబృందం మళ్లీ రంగంలోకి దిగింది. ఈ రెండవ సీజన్‌లో రాశి ఖన్నా తిరిగి ఆర్‌బిఐ అధికారిణి మేఘా వ్యాస్ పాత్రలో అలరించనున్నారు. గురువారం రోజున షూటింగ్ సెట్స్ నుండి కొన్ని ఆసక్తికరమైన ఫోటోలను స్వయంగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రాశీ అభిమానులతో పంచుకున్నారు. తన మేకప్ రూమ్ విశేషాలతో పాటు, సిరీస్ నేపథ్యానికి సంబంధించి రూ. 500 నోటును చేతిలో పట్టుకున్న ఫోటోను షేర్ చేస్తూ తిరిగి ఫర్జీ 2 కోసం వస్తున్నాను అంటూ ధృవీకరించారు. ఈ సిరీస్ కథానాయకుడు షాహిద్ కపూర్ (సన్నీ) ఈ ఏడాది మార్చి నెలలోనే -ఫర్జీ 2- షూటింగ్‌ను ప్రారంభించారు. అప్పట్లో దర్శకులు రాజ్ అండ్ డికేలతో కలిసి ఉన్న ఫోటోను షేర్ చేస్తూ ఒకటోరోజు ఫర్జీ 2 చిత్రీకరణ జరిగిందని షాహిద్ ప్రకటించారు. మొదటి భాగంలో దొంగ నోట్ల తయారీతో నేర ప్రపంచంలోకి అడుగుపెట్టిన సన్నీ పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. మొదటి సీజన్‌లో షాహిద్ కపూర్, రాశి ఖన్నాతో పాటు విజయ్ సేతుపతి, కే కే మీనన్, భువన్ అరోరా, రెజినా కాసాండ్రా, అమోల్ పాలేకర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటించారు.



## నా మాటలను వక్రీకరించారు!

ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ 'జై శ్రీరామ్' నినాదంపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే. ఆమె కామెంట్స్‌పై హిందూ సంఘాలు, నెటిజన్లు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున రచ్చ జరిగింది. ఈ వివాదం తీవ్రరూపం దాల్చడంతో అనసూయ స్పందిస్తూ మరో వీడియో, పోస్ట్‌ను షేర్ చేశారు. తన మాటలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి తప్పుగా ప్రచారం చేస్తున్నారంటూ ఘాటుగా క్లారిటీ ఇచ్చారు. ఇటీవల అనసూయ మాట్లాడుతూ, 'జై శ్రీరామ్' నినాదం చేసే కొందరి వైఖరిని ప్రశ్నించారు. జై శ్రీరామ్ అనేవాళ్లలో కొందరు దొంగలు ఉన్నారని, ఆ నినాదం ముసుగులో దాడులకు పాల్పడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇక నినాదాలు చేయడం కంటే వ్యక్తుల ప్రవర్తనే ముఖ్యమని, సనాతన ధర్మం పేరుతో అక్రమాలకు పాల్పడటం సరికాదని ఆమె అనడం సోషల్ మీడియాలో పెద్ద దుమారమే రేపింది. అనసూయ చేసిన వ్యాఖ్యలపై హిందూ సంఘాలు, పలువురు నెటిజన్లు తీవ్ర అభ్యంతరం తెలిపారు. హిందువులను, వారి నమ్మకాలను దూషించడం కొందరికి ఫ్యాషన్‌గా మారిందంటూ ఆమెపై మండిపడ్డారు. ఇక దీనిపై తిరిగి స్పందించిన అనసూయ, తాను చేసిన కామెంట్ల తర్వాత దొంగలంతా ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారంటూ కామెంట్ చేయడం వివాదాన్ని మరింత రాజేసింది.





# తన్జీద్ హసన్ అరుదైన మైలురాయి

ఆస్ట్రేలియా గడ్డపై బంగ్లాదేశ్ క్రికెట్‌లో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. యువ ఓపెనర్ తన్జీద్ హసన్ తమీమ్ చారిత్రక సెంచరీతో అరుదైన ఘనత సాధించాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టు రెండో రోజు అద్భుతమైన శతకం బాదిన తన్జీద్.. కంగారూల గడ్డపై టెస్టుల్లో సెంచరీ చేసిన తొలి బంగ్లాదేశ్ బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. తాను ఆడుతున్న రెండో టెస్టులోనే ఈ 25 ఏళ్ల ఎడమచేతి వాటం బ్యాటర్ ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో 23 ఏళ్ల నాటి రికార్డును తన్జీద్ బద్దలు కొట్టాడు. 2003లో మాజీ ఓపెనర్ హన్నన్ సర్కార్ చేసిన 76 పరుగులే ఇప్పటివరకు ఆస్ట్రేలియాలో ఒక బంగ్లా బ్యాటర్ చేసిన అత్యధిక స్కోరు. దానిని అధిగమిస్తూ తన్జీద్ 190 బంతుల్లో 101 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 8 బౌండరీలు, ఒక భారీ సిక్సర్ ఉన్నాయి. అంతకుముందు తొలి రోజు బంగ్లా పేసర్ హసన్ మహమూద్ (6/55) అద్భుత ప్రదర్శనతో ఆస్ట్రేలియాను కేవలం 198 పరుగులకే ఆలౌట్ చేసిన సంగతి తెలిసిందే. దీనికి సమాధానంగా బరిలోకి దిగిన బంగ్లాదేశ్ ఇన్నింగ్స్‌కు తన్జీద్ వెన్నెముకగా నిలిచాడు. కమిన్స్, స్టార్క్, హేజిల్‌వుడ్, లియాన్‌లతో కూడిన ప్రపంచ స్థాయి ఆస్ట్రేలియా బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్నాడు. ఇన్నింగ్స్ ఆరంభంలోనే రెండో ఓవర్లో లియాన్ బౌలింగ్‌లో జీరో పరుగుల వద్ద క్యాచ్ ఇచ్చి బతికిపోయిన తన్జీద్, ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. మొమినుల్ హక్ (49)తో కలిసి రెండో వికెట్‌కు 102 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. 188 బంతుల్లో తన తొలి టెస్టు సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే, శతకం తర్వాత నాథన్ లియాన్ బౌలింగ్‌లోనే లాంగ్-ఆఫ్‌లో క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. "ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి. ఇది నాకు చాలా ప్రత్యేకం. నేను ప్రశాంతంగా ఉంటూ, సాధారణ క్రికెట్ షాట్లు ఆడేందుకు ప్రయత్నించాను" అని తన్జీద్ తెలిపాడు. మొత్తం మీద తన్జీద్ చారిత్రక ఇన్నింగ్స్‌తో బంగ్లాదేశ్ ఈ టెస్టులో పట్టు బిగించింది. ఆస్ట్రేలియాపై చిరస్మరణీయ విజయం సాధించే దిశగా ఆ జట్టు అడుగులు వేస్తోంది.



# నేడు టీమిండియా 600వ టెస్టు

## గాలే వేదికగా శ్రీలంకతో తొలి టెస్ట్



**భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతం కానుంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా తన 600వ టెస్ట్ మ్యాచ్ ఆడేందుకు సిద్ధమైంది. ఈ ఘనత సాధించిన మూడో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది. ఇప్పటివరకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మాత్రమే ఈ మైలురాయిని అందుకున్నాయి.**

**శనివారం (ఆగస్టు 15) నుంచి గాలే వేదికగా శ్రీలంకతో ప్రారంభం కానున్న తొలి టెస్టు, భారత్‌కు ఈ చారిత్రక ఘట్టానికి వేదిక కానుంది. ఇది కేవలం వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ అవకాశాల కోసమే కాకుండా, భారత క్రికెట్ ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.**

భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న ఈ టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కావడం మరో విశేషం. ఈ అరుదైన సందర్భంపై భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పందిస్తూ, "600వ టెస్టుకు నాయకత్వం వహించడం ఎంతో గౌరవంగా ఉంది. అది కూడా స్వాతంత్ర్య దినోత్సవం రోజున కావడం మరింత పెద్ద గౌరవం" అని తన సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

### డబ్ల్యూటీసీ ఫైనల్ లక్ష్యం: గిల్



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరడమే తమ ప్రధాన లక్ష్యమని భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ఐదో స్థానంలో ఉంది. వచ్చే తొమ్మిది టెస్టుల్లో దాదాపు ఆరు లేదా ఏడు మ్యాచ్‌లు గెలిస్తే ఫైనల్‌కు చేరే అవకాశాలు మెరుగవుతాయని గిల్ తెలిపాడు. వచ్చే ఏడాది జూన్‌లో లండన్‌లోని ఓవల్ మైదానంలో డబ్ల్యూటీసీ ఫైనల్ జరగనుంది. కాగా, శ్రీలంక పరిస్థితులకు అలవాటు పడేందుకు భారత జట్టు ముందుగానే అక్కడికి చేరుకుంది. కొలంబోలో శ్రీలంక క్రికెట్ ఎలెవన్ తో సన్నాహక మ్యాచ్ ఆడింది. ఈ అదనపు సమయం ఆటగాళ్లకు పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ఉపయోగపడిందని గిల్ చెప్పాడు. బుమ్రా లేకపోయినా భారత ఫాస్ట్ బౌలింగ్‌పై గిల్ విశ్వాసం వ్యక్తం చేశాడు. ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడని ప్రశంసించాడు. గుర్నూర్ బ్రార్ కూడా పాత బంతితో మంచి బౌన్స్ రాబట్టగలడని పేర్కొన్నాడు. శ్రీలంకలో పిచ్ ల నుంచి బౌలర్లకు పెద్దగా సహకారం లభించకపోవచ్చని.. అలాంటి పరిస్థితుల్లో విభిన్న వ్యూహాలతో ఒత్తిడి పెంచాల్సి ఉంటుందని చెప్పాడు. దేవదత్ పడిక్కల్‌పై కూడా గిల్ ప్రశంసలు కురిపించాడు. గతంలో ఇండియా-ఏ తరపున శ్రీలంకలో ఆడిన అనుభవం అతడికి ఉపయోగపడుతుందని తెలిపాడు. గాలే లాంటి ఓపెన్ మైదానాల్లో గాలి దిశ బ్యాటింగ్‌పై ప్రభావం చూపుతుందని వివరించాడు.

# రింకూకు విజయ గర్వం తలకెక్కింది!



టీమిండియా ఫినిషర్ రింకూ సింగ్‌పై సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రింకూ సింగ్‌కు విజయ గర్వం తలకెక్కిందని నెటిజన్లు మండిపడుతున్నారు. స్టార్ క్రికెటర్‌గా ఎదిగిన రింకూ సింగ్‌కు కనీసం సంస్కారం లేదని ట్రోల్ చేస్తున్నారు. తన ఇంట్లోని పూజ గది సమీపంలోకి రింకూ సింగ్ చెప్పులతో వెళ్లడం విమర్శలకు దారి తీసింది. వినాయకుడి విగ్రహంతో పాటు పలు దేవుళ్ల చిత్రపటాల ముందు ఉన్న తన కిట్ బ్యాగ్‌ను రింకూ సింగ్ స్లిప్పర్స్ విప్పకుండానే తీసుకున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా నెటిజన్లు మండిపడుతున్నారు. అయితే ఈ వీడియో ఎప్పటిది అనే విషయంపై క్లారిటీ లేదు. ఈ వీడియోలో రింకూ సింగ్ ఫోన్ మాట్లాడుతూ తమ పూజ గది సమీపంలో ఉన్న కిట్ బ్యాగ్‌ను తీసుకున్నాడు. అయితే అతని కాళ్లకు స్లిప్పర్స్ ఉండటం వివాదాస్పదమైంది. ఈ వీడియోపై సోషల్ మీడియా వేదికగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రింకూ సింగ్‌ను తిడుతుంటే.. మరికొందరు విమర్శలు గుప్పిస్తున్నారు. 'రింకూ సింగ్‌ను చూడండి. తమ పూజ గదిలోని కిట్ బ్యాగ్‌ను చెప్పులు విడవకుండానే తీసుకుంటున్నాడు. కనీస సంస్కారం లేకపోతే ఎలా? నువ్వు ఎంత తోపు అయినా.. సంస్కృతిని మరవద్దు. దేవుళ్లను అగౌరవపర్చవద్దు.'అని ఓ నెటిజన్ ఘాటుగా కామెంట్ చేశాడు.

# డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గా వీవీఎస్?

## బీసీసీఐలో భారీ మార్పులు.. సెప్టెంబర్ ఏజీఎంలో అధికారిక ప్రకటన?



**అగార్కర్ పదవీకాలంపైనా త్వరలో నిర్ణయం**

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పాలనా వ్యవస్థలో కీలక మార్పులకు రంగం సిద్ధమవుతోంది. భారత మాజీ క్రికెటర్, ప్రస్తుతం బెంగళూరులోని 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' (సీవోఈ) అధిపతిగా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్‌కు పదోన్నతి లభించనుంది. అతడిని 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్' అనే కొత్త, శక్తిమంతమైన పదవిలో నియమించేందుకు బోర్డు కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. సెప్టెంబర్‌లో జరగనున్న బీసీసీఐ వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయి. ప్రస్తుతం లక్ష్మణ్ సీవోఈ (గతంలో జాతీయ క్రికెట్ అకాడమీ) హెడ్‌గా ఆటగాళ్ల పునరావాసం, శిక్షణ వంటి బాధ్యతలు చూస్తున్నాడు. 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్'గా నియమితులైతే, ఆయన పరిధి మరింత విస్తృతం కానుంది. సీనియర్ పురుషుల, మహిళల జట్ల వ్యూహరచన, జాతీయ సెలక్షన్ కమిటీతో సమన్వయం, జూనియర్ స్థాయి నుంచి సీనియర్ స్థాయి వరకు ఆటగాళ్ల ప్రగతిని పర్యవేక్షించడం వంటి కీలక అధికారాలు ఆయన చేతికి వస్తాయి. ఇదే సమయంలో, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ పదవీకాలం కూడా సెప్టెంబర్‌తో ముగియనుంది. ఆయన పదవీకాలాన్ని 2027 జూన్ వరకు పొడిగించాలా? లేక కొత్త వారిని నియమించాలా? అనే అంశంపై కూడా బీసీసీఐ చర్చిస్తోంది. గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని కొత్త కోచింగ్ బృందంతో సమన్వయం కోసం లక్ష్మణ్ లాంటి అనుభవజ్ఞుడి సేవలు అవసరమని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం. గతంలో రాహుల్ ద్రవిడ్ తర్వాత టీమిండియా హెడ్ కోచ్ పదవిని చేపట్టాలని బీసీసీఐ కోరినప్పటికీ, లక్ష్మణ్ సున్నితంగా తిరస్కరించాడు. బెంగళూరులోని నూతన సీవోఈ ప్రాజెక్టుపై దృష్టి సారించేందుకే ఆయన ఆ నిర్ణయం తీసుకున్నాడు. ఇప్పుడు ఆ ప్రాజెక్టు గాడిన పడటంతో, ఆయన అనుభవాన్ని విస్తృత స్థాయిలో ఉపయోగించుకునేందుకు బీసీసీఐ సిద్ధమైంది.

# టీమిండియాకు అంత ఈజీ కాదు

శ్రీలంకలోని గాలే అంతర్జాతీయ స్టేడియం వేదికగా ఆగస్టు 15 నుంచి భారత్, శ్రీలంక జట్ల మధ్య రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా మొదటి మ్యాచ్ ప్రారంభం కానుంది. తొమ్మిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టు టెస్ట్ సిరీస్ ఆడేందుకు శ్రీలంకలో అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో శ్రీలంక కెప్టెన్ ధనంజయ డి సిల్వా మీడియా సమావేశంలో మాట్లాడుతూ టీమిండియాను హెచ్చరించారు. ఆతిథ్య శ్రీలంక జట్టును తేలికగా తీసుకోవద్దని.. ఈ సిరీస్ టీమిండియాకు అంత సులభంగా ఉండబోదని స్పష్టం చేశారు. భారత్, శ్రీలంక జట్లు చివరిసారిగా 2022లో బెంగళూరులో డే-నైట్ టెస్టులో తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ నాయకత్వంలోని టీమిండియా 238 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

# రిటైరయ్యాక రోహిత్‌ను వదలొద్దు

## కోచ్‌గా కోహ్లి సిద్ధంగా లేడు: అశ్విన్



టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ భవిష్యత్ పాత్రలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ.. వీరిద్దరి కోచింగ్ భవిష్యత్‌పై తన అంచనాలను పంచుకున్నాడు. రోహిత్ శర్మ కోచ్‌గా మారే అవకాశాలున్నాయని, అయితే విరాట్ కోహ్లి మాత్రం అందుకు సిద్ధంగా ఉండకపోవచ్చని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా రోహిత్ రిటైర్ కాగానే అతడి సేవలను వినియోగించుకోవాలని ముంబై ఇండియన్స్‌కు కీలక సూచన చేశాడు. రోహిత్ శర్మ వ్యూహాత్మక నైపుణ్యాలను ప్రశంసిస్తూ.. "రేపు రోహిత్ ఆడనని నిర్ణయించుకుంటే, ముంబై ఇండియన్స్ అతడిని తక్షణమే తీసుకోవాలి. ఐదుసార్లు ఐపీఎల్ టైటిళ్లు గెలిపించి, భారత్‌కు ప్రపంచకప్ అందించిన కెప్టెన్ సేవలను వదులుకోకూడదు. అలాంటి వ్యక్తులు సులభంగా దొరకరు. ఒకవేళ హెడ్ కోచ్ పాత్ర శ్రమతో కూడుకున్నదని అతను భావిస్తే, ఒకటి రెండేళ్ల విరామం తర్వాత ఏదో ఒక పాత్రలో తిరిగి వస్తాడు. రాహుల్ ద్రవిడ్ కూడా విరామం తీసుకుని వచ్చాడు. ముంబై ఇండియన్స్ యాజమాన్యం తీరు చూస్తే, రోహిత్ శర్మ లాంటి ఆలోచనాపరుడిని వారు వదులుకుంటారని నేను అనుకోవడం లేదు" అని అశ్విన్ వివరించాడు.




# నేటి నుంచి హాకీ మెగా టోర్నీ

## ప్రపంచకప్‌కు సిద్ధమైన భారత్.. 51 ఏళ్ల టైటిల్ నిరీక్షణ తీరేనా?

ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్ 2026 టోర్నీకి భారత్ సిద్ధమైంది. 51 ఏళ్ల టైటిల్ నిరీక్షణ తెరదించడమే లక్ష్యంగా హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత పురుషుల హాకీ టీమ్ బరిలోకి దిగుతోంది. నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీలో భారత్‌తో సహా మొత్తం 16 జట్లు పోటీ పడుతున్నాయి. ఇంగ్లండ్, పాకిస్థాన్, వేల్స్ టీమ్స్‌తో పాటు భారత్ గ్రూప్-డీలో ఉంది. ఆగస్ట్ 15 నుంచి 30వరకు నాలుగు దశల్లో ఈ మెగా టోర్నీ జరగనుంది. పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని అందించిన హెడ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ పర్యవేక్షణలోనే భారత్ ఈ టోర్నీ ఆడబోతుంది. పురుషుల, మహిళల హాకీ ప్రపంచకప్ ఏకకాలంలోనే జరగనుంది. హాకీ ఆసియా కప్ 2025ను గెలుచుకోవడం ద్వారా భారత్.. మెగా టోర్నీకి అర్హత సాధించింది. గ్రూప్ దశలో భారత్.. ఇతర జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు తదుపరి రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. దాయాదీ పాకిస్థాన్‌తో భారత్ ఆగస్ట్ 19న తలపడనుంది. వాగోనర్ స్టేడియం వేదికగా సాయంత్రం 6.30 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభం కానుంది.

**భారత షెడ్యూల్:**

**ఆగస్ట్ 15: భారత్ వర్సెస్ వేల్స్, సాయంత్రం 4.30 గంటలకు, వాగోనర్ హాకీ స్టేడియం**
**ఆగస్ట్ 17: భారత్ వర్సెస్ ఇంగ్లండ్, సాయంత్రం 6.30 గంటలకు, వాగోనర్ హాకీ స్టేడియం**
**ఆగస్ట్ 19: భారత్ వర్సెస్ పాకిస్థాన్, సాయంత్రం 6.30 గంటలకు, వాగోనర్ హాకీ స్టేడియం**

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# నీటి భద్రత.. భారత్ ముంగిట అతిపెద్ద సంక్షోభం

భవిష్యత్తు యుద్ధాలు నీటి కోసం జరుగుతాయని చాలా కాలంగా హెచ్చరికలు వినిపిస్తున్నాయి. కానీ ఆ నీటి కోసం పోటీ ఇక కేవలం ప్రజలు, వ్యవసాయం, పరిశ్రమల మధ్యే కాదు.. డిజిటల్ ప్రపంచంతోనూ మొదలైంది. కృత్రిమ మేధ విస్తరణతో పెరుగుతున్న డేటా సెంటర్లు దేశ భవిష్యత్తు నీటి భద్రతకు కొత్త సవాలుగా మారుతున్నాయి. నీరు లేకుండా జీవితం లేదు. ఆహారం లేదు. పరిశ్రమ లేదు. విద్యుత్ ఉత్పత్తి లేదు. చివరకు ఆర్థిక వ్యవస్థ కూడా లేదు. అయినప్పటికీ భారతదేశంలో నీటిని ఇప్పటికీ అపరిమిత వనరులా చూస్తున్నాం. భూగర్భ జలాలు తగ్గుతున్నా, నదులు కలుషితమవుతున్నా, చెరువులు కబ్జాలకు గురవుతున్నా, నగరాల్లో వర్షపు నీరు వరదగా మారి సముద్రంలో కలుస్తున్నా.. నీటి నిర్వహణపై దీర్ఘకాలిక ఆలోచన మాత్రం ఇంకా పరిమితంగానే ఉంది. 2040 వైపు చూస్తే పరిస్థితి మరింత ఆందోళనకరంగా కనిపిస్తోంది. జనాభా పెరుగుదల, పట్టణీకరణ, వ్యవసాయ అవసరాలు, పారిశ్రామిక విస్తరణ, వాతావరణ మార్పులు.. ఇవన్నీ నీటిపై ఒత్తిడిని పెంచనున్నాయి. దీనికి ఇప్పుడు మరో శక్తివంతమైన వినియోగదారు చేరాడు.. డేటా సెంటర్. కృత్రిమ మేధ, మేఘ గణన, వీడియో స్ట్రీమింగ్, డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ వాణిజ్యం.. ఇవన్నీ మనకు కనిపించని భారీ మౌలిక వసతులపై ఆధారపడి ఉన్నాయి. వేలాది సర్వర్లు నిరంతరం పనిచేసే డేటా సెంటర్లు అపారమైన విద్యుత్‌ను వినియోగిస్తాయి. ఆ సర్వర్ల నుంచి వెలువడే వేడిని నియంత్రించడానికి శీతలీకరణ అవసరం. ఆ శీతలీకరణలో నీరు కీలక పాత్ర పోషిస్తుంది. అంటే మనం ఫోన్‌లో ఒక ప్రశ్న అడిగి కృత్రిమ మేధ నుంచి సమాధానం పొందుతున్నప్పుడు.. దాని వెనుక ఎక్కడో ఒక డేటా సెంటర్ విద్యుత్‌ను వినియోగిస్తూ, వేడిని నియంత్రించుకుంటూ, నీటిని కూడా ఉపయోగిస్తూ ఉండొచ్చు. ఇదే కొత్త విరోధాభాసం. డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు నీరు అవసరం. కానీ నీటి కొరతతో పోరాడుతున్న దేశానికి డిజిటల్ అభివృద్ధి ఎంతవరకు నీటిని వినియోగించాలి? ఇది డేటా సెంటర్లను వ్యతిరేకించే ప్రశ్న కాదు. భారత్ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ముందుకు వెళ్లాలి. కృత్రిమ మేధలో ప్రపంచ స్థాయి సామర్థ్యాన్ని సాధించాలి. డేటా మౌలిక వసతులు పెరగాలి. పెట్టుబడులు రావాలి. ఉద్యోగాలు సృష్టించాలి. కానీ ఏ అభివృద్ధి మోడల్ అయినా నీటి భద్రతను బలిపీఠంపై పెట్టి నిర్మించకూడదు. ముఖ్యంగా నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో డేటా సెంటర్ల స్థాపనకు ప్రత్యేక ప్రమాణాలు అవసరం. ఒక డేటా సెంటర్‌కు ఎంత నీరు అవసరం? ఆ నీరు ఎక్కడి నుంచి వస్తోంది? స్థానిక భూగర్భ జలాలపై ప్రభావం ఎంత? శుద్ధి చేసిన మురుగునీటిని ఎంత మేరకు ఉపయోగిస్తున్నారు? నీటి వినియోగ సామర్థ్యం ఎంత? అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ నీటి వనరులు ఉన్నాయా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకుండా అనుమతులు ఇవ్వడం ప్రమాదకరం. ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలు నీటి ఒత్తిడిని ఇప్పటికే ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో జనాభా అవసరాలు, పరిశ్రమల అవసరాలు, ఐటీ రంగ అవసరాలు, డేటా సెంటర్ల అవసరాలు ఒకదానితో ఒకటి పోటీ పడే పరిస్థితి రావచ్చు. అందుకే 'డేటా సెంటర్ ఎక్కడ పెట్టాలి?' అన్న ప్రశ్నకు భూమి ధర, విద్యుత్ లభ్యత మాత్రమే సమాధానం కాకూడదు. నీటి లభ్యత కూడా ప్రధాన ప్రమాణం కావాలి. నీరు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల్లోనూ అజాగ్రత్తకు చోటుండకూడదు. సముద్రతీర ప్రాంతాల్లో సముద్రజలాన్ని శుద్ధి చేసి ఉపయోగించడం, మురుగునీటి పునర్వినియోగం, మూసివేసిన శీతలీకరణ వ్యవస్థలు, గాలితో శీతలీకరణ, అధునాతన తక్కువ నీటి వినియోగ సాంకేతికతలు వంటి మార్గాలను ప్రోత్సహించాలి. డేటా సెంటర్లు వినియోగించిన నీటిని సాధ్యమైనంత మేరకు శుద్ధి చేసి తిరిగి వినియోగించే విధానాలు తప్పనిసరి చేయాలి. ఇక్కడ ప్రభుత్వాల బాధ్యత చాలా పెద్దది. పెట్టుబడులు వస్తున్నాయన్న ఆనందంలో పర్యావరణ అనుమతులు, నీటి లభ్యత, స్థానిక ప్రజల అవసరాలను విస్మరించకూడదు. పెట్టుబడిదారుడికి భూమి ఇవ్వడం సులభం.. కానీ నీటిని తిరిగి సృష్టించడం అసాధ్యం. భారత్ 2040ను దృష్టిలో పెట్టుకుని జాతీయ నీటి భద్రతా విధానాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రతి రాష్ట్రం తన నీటి బడ్జెట్ రూపొందించాలి. పట్టణం, పరిశ్రమ, వ్యవసాయం, డేటా సెంటర్.. ప్రతి రంగానికి నీటి వినియోగ పరిమితులు, పునర్వినియోగ లక్ష్యాలు ఉండాలి. ప్రస్తుతం వర్షం పడితే నీరు పారిపోతోంది. వేసవి వస్తే అదే నీటి కోసం ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నాం. నగరాల్లో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు ఉన్నా వాటి నిర్వహణ సరిగా లేదు. గ్రామాల్లో చెరువులు ఉన్నా పూడికతో సామర్థ్యం తగ్గుతోంది. భూగర్భ జలాలను పునర్భరణ చేయాల్సిన చోట నిర్మాణాలు పెరుగుతున్నాయి. నీటి సంక్షోభానికి పరిష్కారం కేవలం కొత్త డ్యామ్‌లు కాదు. ఉన్న ప్రతి చుక్కను సమర్థంగా నిర్వహించడమే. వ్యవసాయంలో సూక్ష్మ సేద్యం, తక్కువ నీటి పంటలు, నీటి పొదుపు పద్ధతులు విస్తరించాలి. పట్టణాల్లో మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు, ఉద్యానవనాలకు, నిర్మాణ రంగానికి ఉపయోగించాలి. పరిశ్రమలు తాగునీటి వనరులపై ఆధారపడకుండా పునర్వినియోగ నీటిని వినియోగించేలా నిబంధనలు కఠినతరం చేయాలి.

# ఓటర్ల జాబితా.. ప్రజాస్వామ్య పరీక్ష?



అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడుతూనే అనర్హుల పేర్లను తొలగించడం ఎన్నికల సంఘం బాధ్యత. కానీ 'శుద్ధీకరణ' పేరుతో ఒక్క అర్హుడి పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూడటమే అసలు ప్రజాస్వామ్య పరీక్ష. భారత ప్రజాస్వామ్యానికి ఓటర్ల జాబితా పునాది. ఓటరు జాబితాలో పేరు లేకపోతే రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఆచరణలో అర్థరహితమవుతుంది. అందుకే ఓటర్ల జాబితాను క్రమం తప్పకుండా సరిచేయడం అవసరమే. మరణించినవారి పేర్లు, శాశ్వతంగా వలస వెళ్లినవారి వివరాలు, నకిలీ లేదా అనర్హమైన నమోదులను తొలగించడం ఎన్నికల వ్యవస్థను శుభ్రంగా ఉంచడానికి అవసరం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సంఘం ప్రకటించిన లక్ష్యం కూడా స్పష్టమే.. అర్హుడైన ఒక్క పౌరుడు కూడా జాబితా నుంచి మిగలకూడదు; అనర్హుడైన ఒక్క వ్యక్తి కూడా చేరకూడదు. కానీ ఆచరణలో ఎదురవుతున్న సమస్యలే అసలు ఆందోళనకు కారణం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోంది. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి పాత ఓటర్ల జాబితాలతో వివరాలను అనుసంధానం చేయడంలో కొందరు ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వార్తలు వచ్చాయి. ఒకరి పేరు నిజంగా అనర్హత వల్ల తొలగించారా? లేక పత్రం సమర్పించలేకపోవడం, సమాచారం అందకపోవడం, చిరునామా మారడం, సాంకేతిక పొరపాటు వంటి కారణాలతో తొలగిపోయిందా? ప్రజాస్వామ్యంలో ఈ రెండింటి మధ్య చాలా పెద్ద తేడా ఉంది. దేశంలో కోట్లాది మంది ప్రజలు ఉపాధి, విద్య, వివాహం, ఉద్యోగం వంటి కారణాలతో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలస వెళ్తున్నారు. కొందరు గ్రామాల్లో ఉంటూ పట్టణాల్లో పనిచేస్తున్నారు. కొందరు అద్దె ఇళ్లలో తరచూ నివాసం మార్చుకుంటున్నారు. వృద్ధులు, నిరక్షరాస్యులు, దివ్యాంగులు, దూర ప్రాంతాల్లో నివసించే ప్రజలు, పత్రాలు సరిగా లేని పేద కుటుంబాలు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. అందుకే ఓటర్ల జాబితా సవరణలో 'తొలగించడం' కంటే 'ధృవీకరించడం' ముఖ్యం. ఒక పేరు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే తొలగించడం కంటే సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వాలి. వివరణ ఇచ్చుకునే అవకాశం కల్పించాలి. అభ్యంతరాలు స్వీకరించాలి. నిర్ణయం తీసుకున్న తర్వాత అప్పీల్ చేసుకునే అవకాశం ఉండాలి. ఎన్నికల సంఘం వ్యవస్థలో క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియకు స్థానం ఉన్నప్పటికీ, అది ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండటం అత్యంత అవసరం. ఎందుకంటే ఒక అనర్హుడి పేరు జాబితాలో ఉండటం ఎన్నికల వ్యవస్థకు సమస్య అయితే.. ఒక అర్హుడి పేరు తొలగిపోవడం ప్రజాస్వామ్యానికి మరింత తీవ్రమైన సమస్య. ఇటీవల పశ్చిమ బెంగాల్ ఎస్ఐఆర్ విషయంలో సుప్రీంకోర్టు కూడా తొలగించబడిన ఓటర్లకు సంబంధించిన అప్పీళ్లపై ఎన్నికల సంఘం నుంచి వివరాలు కోరింది. అప్పీళ్ల పరిష్కారం వేగవంతం కావాలని న్యాయస్థానం సూచించింది. ఈ పరిణామం ఒక విషయాన్ని స్పష్టం చేస్తోంది.. ఓటర్ల జాబితా సవరణ కేవలం పరిపాలనా ప్రక్రియ కాదు; అది పౌరుడి రాజ్యాంగ హక్కుతో ముడిపడి ఉన్న అంశం. అదే సమయంలో రాజకీయ పార్టీలు కూడా బాధ్యతగా వ్యవహరించాలి. ప్రతి తొలగింపునూ కుట్రగా అభివర్ణించడం ఎంత తప్పో, ప్రతి తొలగింపునూ 'శుద్ధీకరణ' పేరుతో సమర్థించడం కూడా అంతే ప్రమాదకరం. అధికార, ప్రతిపక్ష పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం ఓటర్ల జాబితాను ఉపయోగించకుండా ప్రజల హక్కుల పరిరక్షణలో భాగస్వాములు కావాలి. ఎన్నికల సంఘం ముందున్న అసలు పరీక్ష కూడా ఇదే. ఓటర్ల జాబితా శుభ్రంగా ఉండాలి.. కానీ ప్రజల హక్కులను తుడిచిపెట్టేంతగా కాదు. సాంకేతికతను విస్తృతంగా ఉపయోగిస్తున్న ఈ రోజుల్లో ఓటర్ల ధృవీకరణ ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండాలి. ఒకరి పేరు ఎందుకు తొలగించారు? ఏ ఆధారంతో తొలగించారు? తిరిగి చేర్చుకోవడానికి ఏ అవకాశం ఉంది? ఫిర్యాదు ఎక్కడ చేయాలి? నిర్ణయం ఎప్పుడు వస్తుంది? అనే వివరాలు ప్రతి ఓటరుకు సులభంగా అర్థమయ్యే భాషలో అందాలి. చివరికి ఓటర్ల జాబితా అనేది కేవలం పేర్లు, సంఖ్యలతో కూడిన పత్రం కాదు. అది భారత ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి రాజకీయ ఉనికికి గుర్తింపు. అందుకే శుద్ధీకరణ జరగాలి. నకిలీ పేర్లు తొలగాలి. అనర్హులు బయటకు వెళ్లాలి. కానీ అదే సమయంలో అర్హుడైన ఒక్క పౌరుడి ఓటు హక్కు కూడా ప్రమాదంలో పడకూడదు.

- రమణారావు నారికేళ్ల, హైదరాబాద్

# ప్లేటులో ముక్క..
# చేతిలో సీసా!

ఒకప్పుడు పండుగలు, పబ్బాలు లేదా శుభకార్యాలకే పరిమితమైన మాంసాహారం, మద్యం నేడు తెలంగాణ సగటు పౌరుడి రోజువారీ జీవనశైలిలో భాగమైపోయాయి. ఆహార ప్రాధాన్యతలలో మార్పు సహజమే అయినప్పటికీ, తెలంగాణలో నమోదవుతున్న గణాంకాలు కేవలం ఒక శైలి మార్పును మాత్రమే కాక, ప్రజారోగ్యం, సామాజిక క్రమంపై పడుతున్న ప్రతికూల ప్రభావాలను స్పష్టంగా సూచిస్తున్నాయి. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే వివరాలు ఈ సంస్కృతి లోతును వెల్లడిస్తున్నాయి.

(మారిన తెలంగాణ జీవన శైలి)



**మాంసాహారం, మద్యం వినియోగంలో, ప్రత్యేకించి ఏటా తలసరి మాంసం వినియోగంలో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం రాష్ట్రంలో శాకాహారులు కేవలం 1.3 శాతం మాత్రమే కాగా, 98.7 శాతం మంది మాంసాహార ప్రియులే. దాదాపు 58 శాతం మంది వారానికి కనీసం ఒక్కసారైనా కోడి మాంసం తీసుకుంటున్నారు.**

ఏటా తలసరి మాంసం వినియోగంలో తెలంగాణ 21.17 కిలోలతో దేశంలోనే మొదటి స్థానంలో ఉండగా, తరువాతి స్థానాల్లో కేరళ (13.06 కిలోలు), అసోం (10.8 కిలోలు) నిలుస్తున్నాయి. జాతీయ తలసరి సగటు కేవలం 7.1 కిలోలుగా ఉండగా, దానికి మూడు రెట్లు ఎక్కువ వినియోగం తెలంగాణలో నమోదవుతుండటం విశేషం. మరోవైపు పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో కూడా 98.3 శాతం మంది మాంసాహారాన్ని ఆస్వాదిస్తుండగా, రాజస్థాన్ (25.1 శాతం), హర్యానా (30.8 శాతం) వంటి ఉత్తరాది రాష్ట్రాల్లో మాంసాహార వినియోగం అత్యల్పంగా ఉంది. అటు మద్యం వినియోగంలోనూ తెలంగాణ దేశంలోనే అగ్రశ్రేణిలో ఉంది. సర్వే వివరాల ప్రకారం, 15 సంవత్సరాలు పైబడిన పురుషులలో 43.3 శాతం మంది మద్యం తీసుకుంటున్నారు. పెద్ద రాష్ట్రాల వర్గంలో తెలంగాణ మొదటి స్థానంలో నిలవగా, అరుణాచల్ ప్రదేశ్ (53 శాతం) తర్వాత దేశంలోనే రెండవ అత్యధిక శాతంగా రికార్డయింది. జాతీయ సగటు 18.8 శాతంతో పోలిస్తే తెలంగాణ వినియోగం రెట్టింపు కంటే ఎక్కువ. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ (31 శాతం), తమిళనాడు (25 శాతం), కర్ణాటక (21 శాతం) తో పోలిస్తే తెలంగాణలో ఆల్కహాల్ వాడకం స్పష్టంగా ఎక్కువగా ఉంది. మరోవైపు గుజరాత్ వంటి రాష్ట్రాల్లో నిషేధం కారణంగా ఇది అత్యల్పంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి అబ్కారీ శాఖ రాబడి ఏటికేడు రికార్డు స్థాయిని దాటుతుండటం ఇక్కడి తీవ్ర వ్యసన అలవాట్లకు అద్దం పడుతోంది.

మాంసాహారాన్ని పరిమితికి మించి తీసుకోవడం, దానికి మద్యం తోడవడంతో రాష్ట్రంలో పలు తీవ్రమైన జీవనశైలి వ్యాధులు విజృంభిస్తున్నాయి. అధిక మద్యం, కొవ్వు ఎక్కువగా ఉండే మాంసాహారం వల్ల కాలేయంలో కొవ్వు చేరుకునే సమస్యలు పెరిగి, చివరికి కాలేయ క్షయ వ్యాధికి దారితీస్తున్నాయి. అలాగే మేక మాంసం వంటి రెడ్ మీట్ అధికంగా తినడం వల్ల రక్తంలో చెడు కొలెస్ట్రాల్, కొవ్వు పదార్థాలు పెరిగి లేత వయస్సులోనే గుండెపోటు, అధిక రక్తపోటు బారిన పడుతున్నారు. శారీరక శ్రమ తగ్గి కేలరీలు ఎక్కువగా ఉండే మద్యం, మాంసకృత్తులు-కొవ్వు పదార్థాలు తీసుకోవడం వల్ల టైప్-2 మధుమేహం, ఊబకాయం విపరీతంగా పెరిగాయి. మద్యం, క్రమం తప్పకుండా వేయించిన లేదా బొగ్గులపై కాల్చిన మాంసం తీసుకోవడం వల్ల జీర్ణశయాంతర, పేగు క్యాన్సర్లు పెరిగే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా ఈ రెండింటి కలయిక వల్ల శరీరంలో యూరిక్ యాసిడ్ పెరిగి కీళ్ల నొప్పుల వ్యాధి తీవ్రమవుతోంది.

మద్యపానం, శారీరక ఆవేశాన్ని పెంచే అలవాట్లు సమాజంలో నేరాల శాతాన్ని నేరుగా ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా గృహ హింస కేసులను పరిశీలిస్తే, అందులో 60 శాతానికి కంటే ఎక్కువ సంఘటనలు మద్యం మత్తులోనే జరుగుతున్నాయి. పెరిగిన మద్యం ఖర్చుల వల్ల కుటుంబాలపై ఆర్థిక భారం పడటం, ఆపై మైకంలో గొడవలకు దిగడం వల్ల కుటుంబ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. మరోవైపు రాష్ట్రంలో జరుగుతున్న ఘోర రోడ్డు ప్రమాదాలకు, అమాయకుల ప్రాణ నష్టానికి మద్యం మత్తులో వాహనాలు నడపడమే ప్రధాన కారణమవుతోంది. వారాంతాల్లో మద్యం దుకాణాలు, బార్ల వద్ద చిన్న చిన్న విషయాలకే విచక్షణ కోల్పోయి ఘర్షణలకు దిగడం, హత్యలు లేదా హత్యాయత్నాలకు పాల్పడటం లాంటి సంఘటనలు పెరిగిపోతున్నాయి. అంతేకాకుండా మద్యం ప్రభావంలో మహిళలపై వేధింపులు, ఉద్రేకంలో జరిగే నేరాలు పెరిగినట్లు పోలీసు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

మాంసాహారం, మద్యం వినియోగం పెరగడం కేవలం ఒక వ్యక్తిగత అలవాటు మాత్రమే కాదు; ఇది ప్రజారోగ్యం, సామాజిక భద్రతకు సంబంధించిన పెద్ద సవాలు. ఆహార పళ్లెంలో కేవలం మాంసమే కాకుండా కూరగాయలు, పీచు పదార్థాలు ఉండేలా సమతుల్య ఆహారం వైపు మళ్ళాలి. వారం పొడవునా కాకుండా మద్యపానానికి దూరంగా ఉండటం, లేదా పూర్తిగా స్వస్తి చెప్పడం శ్రేయస్కరం. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై తనిఖీలు కఠినతరం చేయడంతో పాటు, కాలేయం, గుండె జబ్బులపై అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన ప్రభుత్వ, సామాజిక బాధ్యత ఎంతైనా ఉంది.

**ఈ జీవనశైలి మార్పుకు ప్రధాన కారణాలు:**

1. ఆర్థిక ఎదుగుదల, పట్టణీకరణ: ప్రజల కొనుగోలు శక్తి పెరగడం, నగరాల్లో సాంకేతిక రంగ విస్తరణ, రాత్రివేళ వినోద సంస్కృతి విస్తరించడం.
2. ఆహార డెలివరీ యాప్‌లు: స్మార్ట్‌ఫోన్ యాప్‌ల ద్వారా ఏ సమయంలోనైనా కోడి మాంసం, బిర్యానీలు ఇంటి ముందరికే రావడం.
3. సామాజిక ఆమోదం: ఒకప్పుడు మద్యం, మాంసాహారాన్ని రహస్యంగా లేదా పరిమితంగా తీసుకునేవారు, కానీ ఇప్పుడు దాదాపు అన్ని రకాల వేడుకల్లో ఇవి ప్రధాన వినోద సాధనాలుగా మారడం.



- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి,
సీనియర్ జర్నలిస్ట్, సెల్: 9010128884

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMA**Rfrom H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004